
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కాకినాడ
జిల్లా వార్తలు
గురువారం 10 జులై 2025 | 5



పిఠాపురం మండలం పి.దొంతమూరు ఉన్నత పాఠశాల మెగా పీటీఎం ఆహ్వానపత్రం

విద్యా పండుగకు వేళాయె!

- నేడు జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్ సమావేశాలు
- గిన్నిస్‌బుక్‌లో రికార్డు నమోదయ్యేలా తల్లిదండ్రుల హాజరు

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

పాఠశాలప్రగతిలో భాగస్వాములు చేయడం, విద్యార్థుల పురోగతి, ఆరోగ్య పరీక్షల వివరాలను తల్లిదండ్రులకు తెలియచెప్పడం లక్ష్యంగా అన్ని యజమాన్యాల్లోని పాఠశాలలు,కళాశాలల్లో మెగా పేరెంట్ టీచర్ సమావేశాలను గురువారం నిర్వహించనున్నారు. ఇందునిమిత్తం ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వానాలు పంపారు. పాఠశాలలు, కళాశాలలును ముస్తాబు చేశారు.

కాకినాడ జిల్లాలోని 1260 ప్రభుత్వ పాఠశాలలు, 598 ప్రైవేటు, 20 ఎయిడెడ్ పాఠశాలల్లో 2,78,932మంది విద్యార్థులు చదువుతుండగా, 141 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో 45,344మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరి తల్లిదండ్రులందరినీ ఆయా పాఠశాలలు, కళాశాలల్లో 10వతేదీ ఉదయం 9గంటలనుంచి సాయంత్రం వరకూ నిర్వహించే మెగా పేరెంట్ టీచర్ మీటింగ్(మెగా పీటీఎం-2.0)లో భాగస్వాములు చేయడం ద్వారా గిన్నీస్‌బుక్‌లో రికార్డు సాధించాలని విద్యాశాఖ సంకల్పించింది. విద్యాశాఖాధికారులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం వీటి నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలనుంచి విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులకు ఆహ్వానాలు పంపారు. వీరితోపాటు పూర్వవిద్యార్థులు, విద్యారంగ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆహ్వానించారు.

తల్లిదండ్రులతో ముఖాముఖి

ఈసారి మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖాముఖికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థుల విద్యాప్రగతికి సంబంధించి ప్రోగ్రెస్‌కార్డులను తల్లిదండ్రులకు సంబంధిత క్లాస్ టీచర్లు అందజేయనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించారు. విద్యార్థుల ప్రతిభ, పురోగతి, తరగతి గదిలో వారి ప్రవర్తన, పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన వైద్యపరీక్షల్లో గుర్తించిన అంశాలను వివరించనున్నారు.

తల్లిదండ్రులతో ఫొటోలకు ఫొటోబూత్

తర్వాత విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఫొటోలు దిగేందుకు వీలుగా ఫొటో బూత్, పేరెంట్స్‌కు ఆటల పోటీలు, సమావేశం నిర్వహణ, అనంతరం పాఠశాల, కళాశాలల్లోనే అందరితో కలిసి మధ్యాహ్న భోజనం చేయడం తదితర కార్యక్రమాలు ఉంటాయి. పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వం కల్పించిన, కల్పించబోతున్న సదుపాయాలు, మౌలిక వసతుల గురించి వివరించడంతోపాటు ఇంకా ఏయే సౌకర్యాలు కల్పించాలన్న అంశంపై పేరెంట్స్ అభిప్రాయాలు సేకరించనున్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, ఉన్నతస్థానాల్లో నిలిచిన పూర్వవిద్యార్థులతో మాట్లాడిస్తారు. జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఇందులో పాలుపంచుకోనున్నారు.

మెగా పీటీఎం-2.0 నిర్వహణను కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పాఠశాలలు, కళాశాలల్లో జరిగే ఈ కార్యక్రమంలో ఎక్కువమంది పాలుపంచుకునే ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. అందరూ తమ పిల్లలు చదివే పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలని, వారి ప్రగతి తెలుసుకోవాలని విద్యాశాఖాధికారులు కోరుతున్నారు.

పేరెంట్ టీచర్ మీటింగ్‌కు విస్తృత ఏర్పాట్లు

పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని సమగ్ర శిక్ష ఏపీవో వేణుగోపాలరావు, కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ చామంతి నాగేశ్వరరావులు తెలిపారు. తల్లిదండ్రులు, ప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఆహ్వానాలు పంపారని తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ఈ సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు.



ధాన్యలక్ష్మి.. వచ్చేసింది!

అన్నదాతలకు తీపి కబురు



- ధాన్యం బకాయిలన్నీ విడుదల
- మొత్తం రూ.362 కోట్లుపైనే
- 24 గంటల్లో చెల్లించేలా నిర్ణయం
- నేడు,రేపు జమకానున్న డబ్బులు
- కోనసీమకు రూ.189 కోట్లు
- తూర్పునకు రూ. 93.74 కోట్లు
- కాకినాడకు రూ.80 కోట్లు
- బాకీల విడుదలతో హర్షం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రైతులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. దాదాపు రెండు నెలలుగా పేరుకుపోయిన ధాన్యం బాకీ లకు మోక్షం కల్పించింది.ఈ మేరకు 24 గంట ల్లోగా వీటిని చెల్లించాలని బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పేరుకు పోయిన రూ.362.72 కోట్ల బాకీలు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ఆసన్నమైన తరుణంలో బాకీలు పంట పెట్టుబడికి ఉపయోగపడనున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.362.74 కోట్లు చెల్లింపు

ఉమ్మడి జిల్లాలో ధాన్యం బాకీలు పేరుకుపోవడంతో అన్నదాతలు కొన్ని రోజులుగా డబ్బులకు ఎదురుచూస్తున్నారు.మిగిలిన బాకీలు చెల్లిస్తే ఖరీఫ్ సాగుకు డబ్బులు పనికొస్తాయని ఆశించారు. ఈ బాకీలకు సంబంధించి పౌరసరఫరాల సంస్థకు కేంద్రం నుంచి నిధులు రావడం ఆలస్యమైంది. దీంతో రైతులు పలు చోట్ల ఆందోళనలు చేసిన విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. అన్నదాతలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సీఎం చంద్ర బాబు పౌర సరఫరాల సంస్థతో ఇటీవల సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.800 కోట్ల వరకు బాకీలు ఉన్నాయని అధికారులు వివరించారు. బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ధాన్యం బకాయిలపై చర్చ జరిగింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్నదాతలకు తక్షణం రూ.672 కోట్లు తక్షణం చెల్లింపులు చేయాలని సీఎం ఆదేశించారు. గురు, శుక్రవారాల్లో రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో రూ.93.74 కోట్లు, కాకినాడ జిల్లాలో రూ.80 కోట్లు,కోనసీమ జిల్లా లో రూ.189 కోట్ల వరకు బాకీల చెల్లింపులు జరగనున్నాయి.మొత్తం 362.74కోట్లు చెల్లిస్తారు. తద్వారా రైతులకు ధాన్యం బాకీల బెంగ తీరనుంది. రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఇప్పటికే రూ.1327 కోట్లు చెల్లింపు

ఈ ఏడాది రబీ సీజన్‌లో ఏప్రిల్ నుంచి మే నెలాఖరు వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసింది. ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతల నుంచి ధాన్యం సేకరించింది. ఈ మేరకు అన్నదాతలకు ఇప్పటి వరకు రూ.1,327 కోట్లు చెల్లింపులు చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో అన్నదాతలు నరకం చూసేవారు.కానీ ప్రభుత్వం మారాక రబీ సీజ న్‌లో రైతులు పండించిన ధాన్యం దాదాపు కొనుగోలు చేయడానికి నిర్ణయించింది. తేమ శాతం దగ్గర నుంచి కొనుగోలు వరకు ఎక్కడా రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవహరించింది. మే నెల వరకు సుమారుగా 7.05 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసింది. కాకినాడ జిల్లాలో 15,667 మంది అన్నదాతల నుంచి 1.42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందుకు రూ.322 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. వీటిలో ఇప్పటికే 1,167 మంది రైతులకు రూ.242 కోట్లు జమ చేసే సింది. తూర్పుగోదావరి జిల్లాలో 30,481 మంది అన్నదాతల నుంచి 3.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. దీని విలువ రూ.814 కోట్లు.ఇప్పటి వరకు రైతులకు రూ.721 కోట్లు చెల్లించేసింది.ఇంకా రూ.93.94 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉంది. కోనసీమ జిల్లా 22 మండలాల్లో 340 కొనుగోలు కేంద్రాల ద్వారా 33,507 మంది రైతుల ద్వారా రూ.603 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసింది. రూ.364 కోట్ల వరకు చెల్లింపులు చేసింది.

24 గంటల్లో సొమ్ము జమ
మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా 30,988 మంది రైతుల ఖాతాల్లోకి 24 గంటల్లో ధాన్యం సొమ్ము జమ అవుతుందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో కూటమి ప్రభుత్వం రైతాంగానికి తీపి కబురు అందించిందన్నారు. పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ కేంద్ర ప్రభుత్వంతో చర్చించారన్నారు.ధాన్యం పాత బకాయిలు వెయ్యి కోట్లకు రూ.672 కోట్ల విడుదలకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు.

రండి.. రండి.. దయ చేయండి!



- మెగా పీటీఎం 2.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయండి
- ఆగస్టు 1 నుంచి మహిళల హాకీ చాంపియన్‌షిప్ పోటీలు
- 3వతేదీ నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ
- కార్యక్రమాల నిర్వహణలో స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార, వాణిజ్య పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలి
- మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కాకినాడజూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈనెల పదోతేదీన అన్నిప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ యాజమాన్యాల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్న మెగా తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం మెగా పీటీఎం 2.0 కార్యక్రమం, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, జాతీయ జూనియర్ఉమెన్ హాకీ చాంపియన్‌షిప్‌కు సంబంధించి జిల్లా యంత్రాంగం నుంచి చేస్తున్న ఏర్పాట్ల వివరాలను కలెక్టర్ షాన్‌మోహన్ పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు.

ఉత్సాహంగా పాల్గొనండి..

జిల్లాలోని 1260 ప్రభుత్వ, 596 ప్రైవేటు, 20 ఎయిడెడ్ వెరసి 1,876 పాఠశాలల్లో 2,78,932 మంది విద్యార్థులు చదువుతున్నారని, 141 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థల్లో 45,344మంది విద్యార్థులు చదువుతున్నారని,వీరందరి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని ఉత్సవ స్థాయిలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ వివరించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు, పేరెంట్ టీచర్ అసోసియేషన్లు, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాలను నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల విద్యాశాఖ అధికారులకు పర్యవేక్షణ బాధ్యత అప్పగించామన్నారు.

ఇలా చేస్తారు..

మెగా పీటీఎంలో ఉపాధ్యాయులు ప్రతివిద్యార్థి విద్య, వికాస ప్రగతితోపాటు ఆరోగ్యం పరిస్థితిని తల్లిదండ్రులకు వివరిస్తారని కలెక్టర్ తెలిపారు. పచ్చదనం, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఏక్ పేడ్ మా కేనామ్ కార్యక్రమంలో ప్రతి విద్యార్థి తమ తల్లికి గుర్తుగా ఒక మొక్కను నాటి కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమ వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు.

స్వచ్ఛందంగా ముందుకు రావాలి

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, హాకీ టోర్నమెంట్‌లను జిల్లాలో ప్రతిష్టాత్మంగా నిర్వహించేందుకు అభ్యర్థులు, క్రీడాకారులకు అల్పాహారం, భోజన సదుపాయం కల్పించేందకు ధన, వస్తు, ఆహార రూపేణ సాయం చేసేందుకు జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామికవేత్తలు, దాతలు ముందుకు రావాలని కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు.

3 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

విశాఖపట్నం ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఆగస్టు 3 నుంచి 20 వరకు కాకినాడ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు 13 జిల్లాలతోపాటు యానానికి చెందిన 22వేలమంది అభ్యర్థులు ఈ రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్నారని, ఆన్‌లైన్ స్క్రీనింగ్ తర్వాత వీరిలో 15వేలమంది కాకినాడలో నిర్వహించే ఆర్మీ ర్యాలీకి హాజరుకానున్నట్టు ఆయన తెలిపారు. ఈ ర్యాలీ నిర్వహణలో 145మంది ఆర్మీ అధికారులు, సిబ్బంది పాల్గొంటారని, ర్యాలీకి అవసరమైన ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం వివిధశాఖలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఆర్మీ ర్యాలీలో పాల్గొనే అభ్యర్థుల కోసం తాగునీరు, మరుగుదొడ్లుషామియానాలు వంటి అంశాలపై దృష్టి సారించి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

మహిళల హాకీ చాంపియన్‌షిప్ పోటీలు

ఆగస్టు 1 నుంచి 12 వరకు కాకినాడలో జరిగే జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ పోటీల నిర్వహణలో జిల్లా యంత్రాంగానికి తగిన తోడ్పాటును అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలు, దాతలు ముందుకు రావాలని కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ పోటీలు కాకినాడ స్పోర్ట్స్ అథారిటీ మైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్‌లో జరగనుందన్నారు. ఇటీవల జిల్లాలో స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో ఆస్ట్రోటర్ఫ్‌పై విజయవంతంగా నిర్వహించిన జాతీయ సివిల్ సర్వీసెస్ హాకీ చాంపియన్‌షిప్ పోటీలతో కాకినాడ హాకీ క్రీడకు ముఖ్య కేంద్రంగా మారిందన్నారు. అదేతరహాలో జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ నిర్వహణకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలనుంచి 500మంది క్రీడాకారులు, 200 మంది సహాయక సిబ్బంది హాజరుకానున్నారని తెలిపారు. ఈ పోటీల నిర్వహణకు రెవెన్యూ, క్రీడాభివృద్ధి, వైద్య ఆరోగ్యం, మున్సిపల్, కార్పొరేషన్, ఆర్అండ్‌బీ, ఇతర శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తారన్నారు.

గొల్లప్రోలులో వైసీపీకి గట్టి షాక్

7

- గొల్లప్రోలు కౌన్సిల్‌ను పక్కన పెట్టి డిప్యూటీ సీఎం పవన్ ప్రతిపాదనలు ఆమోదించిన కలెక్టర్



కాకినాడ కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు, సంఘాల నాయకులు

సార్వత్రిక బంద్ విజయవంతం

కాకినాడ/కాకినాడ సిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కాకినాడలో చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక బంద్ విజయవంతమైంది. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, భవన నిర్మాణ, ఆటో, హమాలీ, ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఈపీఎఫ్ కనీస పెన్షన్ రూ.9 వేలకు పెంచాలని, సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ కాకినాడ మెయిన్ రోడ్డులోని హెడ్ పోస్టాఫీసు వద్ద నుంచి భారీ ర్యాలీగా కార్మిక సంఘాలు కలెక్టరేట్‌కు చేరుకున్నాయి. మోదీ ప్రభుత్వం భారత కార్మికులను యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్లను కరోనా సమయంలో తీసుకొచ్చిందని విమర్శించారు. ఈ కోడ్లు అమలైతే పర్మినెంట్ ఉద్యోగాలు ఉండవన్నారు. కూటమి ప్రభుత్వం మోదీని అనుసరిస్తూ 8 గంటల పనిని పది గంటలకు పెంచుతూ చేసిన కేబినెట్ తీర్మానాన్ని ఖండించారు. బంద్‌తో కాకినాడలోని బ్యాంకులు, తపాలాశాఖ, ఎల్ఐసీ తదితర ప్రభుత్వ రంగసంస్థలు మూతపడ్డాయి. బంద్‌లో సీఐ టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి,ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, సీఐటీయూ జిల్లా కోశాధికారి మలకా రమణ, మేడిశెట్టి వెంకటరమణ, పలివెల వీరబాబు, అంగన్‌వాడీ నాయకులు జ్యోతి, రమణమ్మ, కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

మీ ఆలోచన ఆదర్శప్రాయం

- ఉపాధ్యాయుడు సీతారామరాజును అభినందించిన కలెక్టర్
- రూ.లక్ష చెక్కు అందజేత


ఉపాధ్యాయుడికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్

గొల్లప్రోలు,జూలై 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మార్గం చూపాలనే మీ ఆలోచన అందరికీ ఆదర్శప్రాయమని గొల్లప్రోలు పట్టణ శివారు సూరంపేట మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అనిశెట్టి సీతారామరాజును కలెక్టర్ షాన్‌మోహన్ అభినందించారు. పాఠశాలకు ఇటీవల బదిలీపై వచ్చిన ఆయన విద్యార్థులు కాలువ దాటి ప్రమాదకర పరిస్థితుల్లో రావాల్సిన పరిస్థితిని గుర్తించి తన సొంత నిధులు రూ.లక్ష వెచ్చించి కాలిబాట వంతెన నిర్మింపజేశారు. దీన్ని సామాజికమాధ్యమాల ద్వారా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ అభినందించారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్‌తో కలిసి ఉపాధ్యాయుడు సీతారామరాజు కలెక్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో కలిశారు. కలెక్టర్ ఆయన్ను అభినందించి ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధుల నుంచి లక్ష రూపాయల చెక్కు అందజేశారు.

పురావస్తుశాఖ నూతన భవన నిర్మాణానికి నిధులు

- రూ.2కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో.. ఇప్పటికే కేంద్రం రూ.8కోట్ల మంజూరు



కార్పొరేషన్(కాకినాడ), జూలై 9(ఆంధ్రజ్యోతి): కాకినాడలో పురాతన, ఆంధ్ర సాహిత్య పరిషత్, ప్రస్తుత పురావస్తుశాఖ నూతన భవన నిర్మాణానికి ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. చదలు పడుతున్న చరిత్ర పుస్తకాలు, పురావస్తు శిల్ప సంపద భద్రపరిచేందుకు ఇప్పటికే నూతన భవనం మంజూరైంది. భవన నిర్మాణానికిగాను రాష్ట్రం ఇవ్వాల్సిన వాటా రూ.2 కోట్లను మంజూరు చేస్తూ బుధవారం జీవో విడుదల చేశారు. ఈ భవన నిర్మాణం కోసం రూ.10కోట్లు నిధులు కేటాయించగా ఇందులో భాగంగా కేంద్ర సాంస్కృతికశాఖ ఇప్పటికే రూ.8కోట్లను మంజూరు చేసింది. రాష్ట్ర వాటాగా రూ.2కోట్లను విడుదల చేయడంతో భవన నిర్మాణానికి అధికారులు టెండర్ ప్రక్రియకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా పురావస్తుశాఖ ఏడీ తిమ్మరాజు మాట్లాడుతూ నాలుగు అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు కావాల్సి ఉందన్నారు. వచ్చిన వెంటనే టెండర్ ప్రక్రియ ప్రారంభించి భవన నిర్మాణం చేపడతామన్నారు. పురావస్తుశాఖ నూతన భవన నిర్మాణం ద్వారా ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంతో విలువైన పురావస్తు శిల్పకళా సంపదతోపాటు తెలుగు సాహిత్యంలోని ఎన్నో అరుదైన గ్రంథాలు, వందలాది తాళపత్ర గ్రంథాలను భద్రపరిచేందుకు అవకాశం కలుగుతుందని, జిల్లాకు చెందిన చరిత్ర, సాహితీ ప్రముఖులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి : జేడీఏ


లబ్ధిదారుల జాబితాను ప్రదర్శిస్తున్న జేడీఏ విజయ్‌కుమార్

కరప, జూలై 9(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని మేలైన అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఎన్.విజయ్‌కుమార్ సూచించారు. కరపమండలం పాతర్లగడ్డ గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఖరీఫ్‌లోకూలీల కొరతను అధిగమించడానికి, పెట్టుబడులు తగ్గించుకోవడానికి బెంగాల్ ఊడ్పు పద్ధతిలో వరినాట్లు వేయాలన్నారు. దిగుబడిని పెంచేందుకు పొటాష్, నానో యూరియా, డ్రోన్ టెక్నాలజీ వంటి మెళకులను పాటించాలన్నారు. విత్తన ఎంపికలో జాగ్రత్తలు వహించాలని సూచించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకంలో అర్హుల జాబితాలను ప్రతి రైతు సేవా కేంద్రంవద్ద ప్రదర్శించామని, జాబితాలో పేర్లు లేని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సంబంధిత ధృవీకరణ పత్రాలతో ఈనెల 13వ తేదీలోపు రైతుసేవాకేంద్రాల్లో దరఖాస్తుచేసుకోవాలన్నారు. ముందస్తు ఖరీఫ్ సాగును అవలంబించి రైతులు లబ్ధిపొందాలని సూచించారు. గ్రామసర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు, కరప సబ్‌డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, ఏవో ఐ.సత్య, ఏఈవో బండారు శ్రీరాములు, వీపీఏ సుల్తానా, బి.లక్ష్మణ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

చోరీ కేసులో దంపతులకు జైలు శిక్ష

పెందుర్తి(విశాఖపట్నం), జూలై 9(ఆంధ్రజ్యోతి): బంగారం చోరీ కేసులో దంపతులకు ఏడాది జైలుశిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ ఏడో అదనపు మెట్రో పాలిటన్ కోర్టు జడ్జి తీర్పు వెలువరించారని విశాఖనగరంలోని పెందుర్తి ఎస్ఐ సూరిబాబు బుధవారం తెలిపారు.కాకినాడకు చెందిన పిన్నింటి గణేశ్(28), మాణిక్యేశ్వరి(24) ఈ ఏడాది ఫిబ్రవరిలో పెందుర్తిలోని రెండు బంగారు దుకాణాల్లో నాలుగు ఉంగరాలు కాజేశారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి ఎస్ఐ దర్యాప్తుచేపట్టారు. నిందితులు భార్యాభర్తలుగా గుర్తించి వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.విచారణ పూర్తవడంతో జైలుశిక్ష,జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

మహిళా ఉద్యోగినులపై ఆర్టీసీ ఉన్నతాధికారి వేధింపులు

విజిలెన్స్ అధికారుల విచారణ

కార్పొరేషన్(కాకినాడ), జూలై 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఒక ఉన్నతాధికారి వేధింపులకు గురిచేస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు కాకినాడ డిపోలో మహిళా ఉద్యోగులను బుధవారం విచారించారు. మహిళా కండక్టర్లు, ఇతర సిబ్బంది ఉద్యోగ సంబంధ విషయాలపై సంబంధిత అధికారి వద్దకు వెళ్తే అసభ్యంగా మాట్లాడడంతోపాటు అతనికి సహకరించకపోతే వేధింపులకు గురిచేస్తున్నారంటూ వచ్చిన ఆరోపణపై విచారణ జరుగుతుంది. ఆయన గతంలో ఇటువంటి ఆరోపణపైనే తుని,రామచంద్రపురం డిపోలకు బదిలీ అయ్యారని సమాచారం.వెళ్లిన ప్రతిచోట కూడా ఇవే ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు మాత్రం డిపోలు మారుస్తున్నారే తప్ప చర్యలు తీసుకునే సాహసం చేయడంలేదని పలువురు మహిళా ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా ఆకాశ రామన్న ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారని, పూర్తి నివేదిక ప్రకారం వివరాలు తెలియజేస్తామని తెలిపారు.

గురు పౌర్ణమికి ముస్తాబు

స్వయంభూగా వెలసిన దత్తాత్రేయుడు కొలువై ఉన్న క్షేత్రం, శ్రీపాద శ్రీవల్లభుల జన్మస్థానమైన మహా సంస్థానం, పలు దత్తపీఠాలకు నెలవుగా ఉన్న పిఠాపురం గురు పౌర్ణమికి సిద్ధమైంది. పట్టణంలోని దత్త క్షేత్రాలు, సాయిబాబా ఆలయాల్లో ఈ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీల సభ్యులు, దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దత్త క్షేత్రాల్లో వేడుకలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిసాల నుంచి భక్తులు అధికంగా తరలి వస్తున్నారు. ఇప్పటికే ఆయా ఆలయాల వసతి సముదాయాలు, ప్రైవేటు వసతి గృహాలు, లాడ్జీలు మహారాష్ట్ర, కర్ణాటక భక్తులతో కిటకిటలాడుతున్నాయి.


పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్తాత్రేయ స్వామి


శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయుడు, నృసింహ సరస్వతి

పిఠాపురం జూలై 9 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా పట్టణంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభూగా వెలసిన దత్తాత్రేయస్వామికి, ఆవరణలో ఉన్న అలక్‌నిరంజన్ దత్త బృందావనంలో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరగనున్నాయి. దత్తాత్రేయ స్వామికి లక్ష గులాబీలతో అర్చన నిర్వహిస్తారు. సాయంత్రం పల్లకి, ఊయల సేవలు జరుగుతాయి. ఇందుకు సంబంధించి దత్తగురువు వాడ్రేవు శ్రీనివాసరావు, ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీపాద శ్రీవల్లభుని జన్మస్థానంగా దేశవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన పట్టణంలోని శ్రీపాదవల్లభ సంస్థానంలో గురు పౌర్ణమి సందర్భంగా శ్రీపాద శ్రీవల్లభులకు అభిషేకాలు, గురు పూజ. సర్వపుష్పపూజ, పల్లకి సేవ, ఇతర కార్యక్రమాలు ఉంటాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు ఇప్పటికే పిఠాపురం చేరుకున్నారు. ఈ ఏడాది గురుపౌర్ణమి గురువారం రావడంతో భక్తుల రద్దీ అధికంగా ఉండనుంది,

పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల గోపాల్ బాబా ఆశ్రమం, సినిమా సెంటర్లోని షిర్డీ సాయినాథ్ మందిరంలో, మెయిన్‌రోడ్డులో గల సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరగనున్నాయి. పట్టణ శివారులోని విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో గురుపౌర్ణమి సభ జరగనుంది. పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా భక్తులకు అనుగ్రహ భాషణ చేస్తారు. పట్టణంలోని సాయిబాబా, దత్త ఆలయాలు అన్నింటినీ ఇప్పటికే ముస్తాబు చేశారు.


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఈదరాడ స్కూలులో ఎంపీటీఎం ఆకృతిలో ఒదిగిన విద్యార్థులు

పీటీఎంకు వేళాయె...

పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) నిర్వహించనున్నారు. ఇందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కొన్ని స్కూల్సులో ఉపాధ్యాయులు, విద్యార్థులు విభిన్నంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వాటిని మీరూ చూడండి.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మానేపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో కాగితపు పూలతో మెగా పీటీఎం స్వాగత ద్వారాన్ని తయారు చేస్తున్న విద్యార్థినులు




తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ హైస్కూల్లో స్వాగత బ్యానర్ (పైన) ఫొటో షూట్ కోసం ఏర్పాట్లు (కింద)



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట కాంతిభారతి స్కూల్లో...

నేటి నుంచి చాతుర్మాస్య వ్రత దీక్షా మహోత్సవం

పిఠాపురంలో చేపట్టనున్న మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్తవిజయానంద స్వామీజీ

సెప్టెంబరు 9 వరకు అనఘా దత్త క్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాలు... అష్టమ కోటి దత్త యాగం నిర్వహణ



పిఠాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మంలో అత్యంత ప్రవిత్రంగా భావించే చాతుర్మాస్య వ్రత దీక్షా మహోత్సవానికి పిఠాపురం వేదిక కానుంది. మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ పట్టణంలోని అగ్రహారంలో కొలువై ఉన్న అనఘా దత్త క్షేత్రంలో గురువారం దీక్ష చేపట్టి సెప్టెంబరు 7వ తేదీ వరకు కొనసాగించనున్నారు. ఇందునిమిత్తం విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి.

దత్త విజయానంద స్వామి చాతుర్మాస్య దీక్ష చేపట్టిన అనంతరం గురుపౌర్ణమి పూజలు, చైతన్యార్చన, పవమాన హోమం, దత్త హోమం, గురు గీతా పారాయణ జరుగుతాయి. నవకోటి దత్తయాగ మహా సంకల్పంలో భాగంగా ఈ నెల 10 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు అష్టమకోటి దత్త యాగం జరుగుతుంది. దీనికి అంకుర్పారణ చేస్తారు. 11వ తేదీ రాత్రి 7 గంటలకు చాతుర్మాస్య ప్రవచనం ప్రారంభిస్తారు. ఈ నెల 11 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు యజుర్వేద పారాయణ, ఈ నెల 17 నుంచి 27వ తేదీ వరకు శత చండీయాగం, ఈ నెల 25 నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు శ్రావణమాస ప్రయుక్త కుంకుమార్చన, ఆగస్టు 3 నుంచి 8వ తేదీ వరకు సంపూర్ణ కృష్ణయజుర్వేదీయ మూల పారాయణం, 8న వరలక్ష్మీ వ్రతం, 9న రాఖీ పౌర్ణమి, హయగ్రీవ జయంతి, శ్రీనివాస కల్యాణం, 16న వెయ్యి మంది దంపతులతో అనఘాష్టమి వ్రతం, శ్రీకృష్ణాష్టమి గోపూజ, 23, 24 తేదీల్లో ప్రాజాప్రత్యేష్టి, సారస్వతేష్టి యాగం, 24న అనఘాలక్ష్మీ సమేత దత్త సత్యనారాయణస్వామికి దివ్య కల్యాణం, 28న దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీరాక, సెప్టెంబరు 7న చాతుర్మాస్య వ్రత పరిసమాప్తి, పవనమాన హోమం జరుగుతాయి.

అనఘా దత్త క్షేతంలో జరిగే పల్లకీ సేవ, రథోత్సవం, మంటపోత్సవం, తెప్పోత్సవం, డోలోత్సవంలో భక్తులు స్వయంగా పాల్గొనే అవకాశం కల్పించారు. దీక్షా మహోత్సవాలు జరిగే సమయంలో ప్రతి ఆదివారం ఉచిత ఆయుర్వేద, అల్లోపతి వైద్య సేవలు అందించనున్నారు. చాతుర్మాస్య దీక్షా మహోత్సవానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాపంగా ఉన్న భక్తులు, గణపతి సచ్చిదానంద స్వామి శిష్యులు తరలివచ్చే అవకాశం ఉండడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో తొలి షిర్డీసాయి ఆలయం

ఆలమూరులో గురు పౌర్ణమికి ప్రత్యేక ఏర్పాట్లు



ఆలమూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోనే తొలి షిర్డీసాయి ఆలయంగా ఖ్యాతిగాంచింది ఆలమూరులోని షిర్డిసాయిబాబా ఆలయం. జొన్నాడ-రావులపాలెం వారధి నిర్మాణ కాంట్రాక్టరు చెలంకూరి సుబ్బారావు 1956లో ఈ ఆలయాన్ని నిర్మించారు. షిర్డీలో ఉన్న బాబా విగ్రహాన్ని రూపొందించిన శిల్పి లాల్లిమ్ ఇక్కడ పాలరాతితో విగ్రహాన్ని చెక్కడం విశేషం. అప్పట్లో అంతగా ఆదరణ లేకపోయినప్పటికీ తర్వాత రోజుల్లో భక్తుల తాకిడి అధికమైంది. స్వయంగా బాబానే ఇక్కడికి వచ్చారనే భావన ఇక్కడి షిర్డీసాయిని దర్శించుకున్న భక్తులకు కలుగుతుంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం మండపేటలో రవాణా శాఖ అధికారిగా పని చేసిన కె.సాయోజీరావు ఇక్కడ ఆలయాన్ని దర్శించి స్థానికులతో అభివృద్ధిపై చర్చించారు. ఆలయం ముందు వున్న షాపులను తొలగించి ఆలయం రోడ్డు పైకి కనిపించేలా చేయడంలో ఆయన విశేష కృషి చేశారు. కమిటీ ఏర్పాటు చేసి నిత్యం పూజలు జరిగేలా చేయడంతో సాయి భక్తులు పెరిగారు. గురువారం గురుపౌర్ణమి సందర్భంగా భారీ ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ చల్లా ప్రభాకరరావు తెలిపారు. బాబాకు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. వేలాది మంది భక్తులకు అన్నసమారాధన చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు.

యువతకు కువైట్‌లో ఉపాధి అవకాశాలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఏపీ సంయుక్తంగా తురియా అనే అంతర్జాతీయ సంస్థతో కలిసి కువైట్‌లో నిర్మాణ రంగంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీడీజీ మురళీ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు చెందిన 24 నుంచి 50 ఏళ్ల మధ్య గల పురుష అభ్యర్థులు అర్హులన్నారు. సిరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్, సీలింగ్ పనులు ఉంటాయన్నారు. దీనికి ఐటీఐ లేదా డిప్లొమా కలిగి ఉండాలని, అలాగే మూడు నుంచి ఐదేళ్ల అనుభవం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు సుమారు రూ. 56 వేల నుంచి 70 వేలు వరకు ఉంటుందన్నారు. మరింత సమాచారం కోసం 99888 53335 ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. వీసా ప్రాసెసింగ్, విమాన టికెట్లు, వైద్య సదుపాయాలు, నివాస ఏర్పాట్లు కంపెనీయే అందిస్తుందన్నారు. ఆసక్తిగలవారు తమ దరఖాస్తులను హెచ్‌టిటిపిఎస్:// నైపుణ్యం.ఏపి.జీవోవి.ఇన్‌లో చూడవచ్చన్నారు. లేదా ఈనెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సత్యదేవ నర్సరీని సందర్శించిన కేంద్ర మాజీ మంత్రి


శ్రీరామ్ సాహెబ్ దాన్వేకు మొక్క అందిస్తున్న దృశ్యం

కడియం, జూలై 9(ఆంధ్రజ్యోతి): కడియపులంక సత్యదేవ నర్సరీని బుధవారం కేంద్ర రైల్వే మాజీమంత్రి, సీనియర్ బీజేపీ నేత శ్రీరామ్ సాహెబ్ దాన్వే సందర్శించారు. ఆయన్ని నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ మొక్కను అందజేసి శ్రీరామ్ సాహెబ్ దాన్వేకు స్వాగతం పలికారు. ఆయన కుటుంబసభ్యులతో విచ్చేసి పలురకాల మొక్కలను చూశారు. వాటి విశిష్టతలు అడిగి తెలుసుకున్నారు. కొన్నిరకాల మొక్కలను కొనుగోలు చేసి తీసుకెళ్ళారు. 2021 నుంచి 2024 వరకు కేంద్ర రైల్వేశాఖ మంత్రిగా ఉన్నానని చెప్పారు. కుమార్తె సంజన శివసేన పార్టీలో 2024లో ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. కార్యక్రమంలో బాబా గ్రూప్స్ చైర్మన్ ప్రవీణ్‌చంద్, పుల్లా నాగేంద్ర, మాగాపు సూర్య, మెర్ల కృష్ణమూర్తి, గట్టి రమేష్, ఎన్. ప్రేమసాగర్, టీ. కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విజయ శంకర సంగీత పాఠశాలలో ప్రవేశాలు

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయ శంకర సంగీత నృత్య పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి కర్ణాటక సంగీతం, గాత్రం, వాయిద్యం, నాట్యం, మృదంగం, డోలు, శాస్త్రీయ నృత్య విభాగాలలో నాలుగు సంవత్సరాల డిప్లొమా కోర్సులు , రెండు సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించనున్నట్టు ప్రభుత్వ సంగీత పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఆసక్తికలిగిన విద్యార్థుల ఎంపికకు కర్ణాటక సంగీతం, డ్యాన్స్, నాట్యం, తదితర విభాగాలలో ప్రతిభా ప్రదర్శన ఆధారంగా ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కోర్సులో చేరే విద్యార్థులు జూలై 1 నాటికి 10 సంవత్సరాలు, డిప్లమా కోర్సులో చేరే విద్యార్థులు జూలై1 నాటికి 15 సంవత్సరాలు నిండి ఉండాలని, సర్టిఫికెట్, డిప్లమా కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తమ దరఖాస్తులను ఈనెల 31 లోగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఫీజు వివరాలు, తదితర పూర్తి వివరాల కోసం ఫోన్ నెంబర్ 0883 - 2421669కు కార్యాలయ పని వేళల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్ర 5 గంటల్లోగా సంప్రదించాలని సూచించారు.

● సంగీత పాఠశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసశర్మ



విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపాల్‌గా పసుమర్తి శ్రీనివాస శర్మ బాధ్యతలు స్వీకరించినట్టు పాఠశాల యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన మండపాక నాగలక్ష్మి పదోన్నతిపై విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలకు బదిలీ అయ్యారు.

కాకినాడ జిల్లా రెడ్‌క్రాస్‌కు అవార్డుల పంట

● సంస్థ అధ్యక్షుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా ప్రదానం


విజయవాడలో పురస్కారం అందుకుంటున్న వైడీ రామారావు

కార్పొరేషన్(కాకినాడ), జూలై9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉత్తమ రెడ్‌క్రాస్ జిల్లా శాఖగా ప్రసిద్ధి గాంచిన కాకినాడ రెడ్‌క్రాస్ మరోసారి సత్తా చాటింది. బుధవారం విజయవాడలో జరిగిన రెడ్‌క్రాస్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం పురస్కార బహూకరణ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు, గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ 2021- 22, 2022-23, 2023-24 సంవత్సరాలకు చెందిన రాష్ట్ర స్థాయి పురస్కారాలను అందజేశారు. ఆయాసంవత్సరాలకు కాకినాడ జిల్లా శాఖ మొదటి స్థానాన్ని గెలుచుకుంది. దీనిలో భాగంగా 2021-22 సంవత్సర పురస్కారాన్ని జిల్లా చైర్మన్ వైడి రామారావు, 2022-23 సంవత్సర పురస్కారాన్ని వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సుగుణ, 2023-24 సంవత్సర పురస్కారాన్ని కోశాధికారి ఎన్‌వీవీఆర్‌కే ప్రసాద్ బాబు గవర్నర్ చేతు లమీదుగా అందుకున్నారు. రెడ్‌క్రాస్‌కు అత్యధిక విరాళాలు అందించడంలో సహకరించిన ఓఎన్ జీసీ ఈడీ అనుపమ్ సక్సేనా, ప్రతినిధి షాదాబ్ అన్వర్, కాకినాడ సీ పోర్ట్స్ ప్రతినిధులు మొహ్మద్ ఖాసీం, మొహద్‌కరీమ్, సాయిరామ ఫ్రోజెన్ ఫుడ్స్ అధినేత ఎల్. సత్యనారాయణ, ఫిలిం డైరెక్టర్ బి.సుకుమార్ తరపున బి.అశోక్, హౌసింగ్ పీడీ ఎన్‌వీ వీ సత్యనారాయణ, సంస్థ కార్యదర్శి కె.శివకుమార్, కార్యవర్గ సభ్యులు ఎస్‌వీఎం చంద్రశేఖర్ పురస్కారాలు అందుకున్నారు. 2017-18లో అత్యుత్తమ జిల్లా శాఖలకు పురస్కారం ప్రారంభించినప్పటి నుంచి వరుసగా కాకినాడ జిల్లా శాఖ రాష్ట్రంలో అగ్రగామిగా మొత్తం ఏడుసార్లు పురస్కారం పొందడం గర్వకారణమని రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, గవర్నర్ రెడ్‌క్రాస్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, వైడి రామారావు, కార్యవర్గ సభ్యులను అభినందించారు.

రావి ఆకుపై సాయినాథుడు


విద్యార్థిని రూపొందించిన చిత్రం

అనపర్తి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గురు పౌర్ణమిని పురస్కరించుకుని అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన విద్యార్థిని బద్దిరాజు లక్ష్మీసుప్రజా పార్వతి రావి ఆకుపై సాయి నాథుడి చిత్రాన్ని రూపొందిస్తూ తన భక్తిభావాన్ని చాటుకుంది. ఈ చిత్రం పలువురిని ఆకట్టుకుంది.

31 వరకు హజ్ యాత్రకు దరఖాస్తులు

రాజమహేంద్రవరం సిటీ/ కార్పొరేషన్ (కాకినాడ), జూలై 9 (ఆంధ్రజ్యోతి): హజ్ కమిటీ ఆఫ్ ఇండియా వారు హజ్‌యాత్ర 2026లో యాత్రకు వెళ్లేవారు ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎం. సునీల్ కుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎస్సీ, బీసీ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరంలోని ఎస్సీ, బీసీ బాలుర, బాలికల సంక్షేమ వసతిగృహాలను బుధవారం సాయంత్రం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అర్బన్ తహశీల్దార్ పి. పాపారావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న, సిటీ ప్లానర్, ముగ్గురు ఇంజనీరింగ్ అధికారులు ఈ తనిఖీలు జరిపారు. ఒక్కొక్క అధికారి మూడు హాస్టళ్ల చొప్పున మొత్తం 18 హాస్టళ్లను తనిఖీ చేసినట్టు తెలిసింది. హాస్టళ్లలో విద్యార్థుల హాజరు, బియ్యం, కోడిగుడ్ల స్టాకు, మౌలిక సదుపాయాలు వంటివన్నీ పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం సక్రమంగా పెడుతున్నారా, కోడిగుడ్డు ఇస్తున్నారా, ఏమైనా సమస్యలున్నాయా వంటి వివరాలను ఆరా తీశారు. విద్యార్థుల హాజరును గూగుల్‌షీట్ యాప్‌లో అప్‌లోడ్ చేసినట్టు సమాచారం. వసతిగృహాల్లో తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలను కలెక్టర్‌కు నివేదికరూపంలో అందజేసే అవకాశం ఉంది. కాగా, రెవెన్యూ, మున్సిపల్ ఉన్నతాధికారులు హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేయడంతో వార్డెన్లు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. హాస్టల్ వార్డెన్లందరికీ బుధవారం సెలవు. సరిగ్గా ఇదే రోజున ఆకస్మిక తనిఖీలు చేపట్టడం గమనార్హం. ప్రధానంగా సంబంధిత ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులను పక్కనబెట్టి తహశీల్దార్ స్థాయి అధికారులను తనిఖీలకు పంపడంతో విద్యార్థుల హాజరులో అవకతవకలకు పాల్పడిన అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

పవన్‌ను విమర్శించే స్థాయి జక్కంపూడికి లేదు

● పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఫైర్


పి.గన్నవరంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

పి.గన్నవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విమర్శించే స్థాయి రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు లేదని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఫైర్‌అయ్యారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే గిడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అకృత్యాలు ఒక్కసారి గుర్తుచేసుకోవాలన్నారు. రియల్‌ఎస్టేట్ వారిని ఇబ్బంది పెట్టి డబ్బులు దండుకున్న మీకు మా అధినేతను విమర్శిస్తారా అని దుయ్యబట్టారు. రాజా తన తండ్రి వారసత్వంతో రాజకీయాల్లోకి రాగా, పవన్ మాత్రం గొప్ప దేశభక్తి భావజాలం, స్వశక్తితో వచ్చారన్నారు. సినిమాలు, రాజకీయాల్లోనే కాదు నిజ జీవితంలోనూ మా అధినేత హీరోనే అన్నారు. ఇకనైనా ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. మహిళల ఆత్మ గౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని అవమానించేలా ప్రసన్న కుమార్‌రెడ్డి మాట్లాడటంపై వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఆయనే స్వయంగా ఆ వ్యాఖ్యలను సమర్థించడం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. చిట్టూరి శ్రీనివాస్, సత్తిబాబు రాజు, పెనుమాల లక్ష్మి, సంసాని పెద్దిరాజు, బొంతు పెదబాబు, వాసంశెట్టి కుమార్, జాలెం శ్రీనివాసరాజా, గణపతి రాఘవులు, దొమ్మేటి సాయికృష్ణ, పత్తిపాటి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల కుటుంబాలకు ఆర్థికసాయం


జిల్లా పోలీసు కార్యాలయంలో చెక్కులు అందజేస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు జిల్లా పోలీసులు రూ. 8 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. గత నెల 26న ఓ కేసుకు సంబంధించి ఆలమూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న ఎస్ఐ మద్దాల అశోక్, ఆత్రేయపురం కానిస్టేబుల్ బ్లైసన్‌జీవన్ కోదాడ వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు. జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది సేకరించిన మొత్తాన్ని ఎస్పీ బి.కృష్ణారావు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అశోక్ కుటుంబానికి రూ. నాలుగు లక్షలు, జీవన్ కుటుంబానికి రూ. నాలుగు లక్షలు చొప్పున చెక్కులు అందించారు. అలాగే 2014 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలు అదనంగా రూ.68వేల చెక్కును ఎస్పీ చేతులమీదుగా అశోక్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

రంగులే.. తీరం కొత్త రూపులే..


కాకినాడ జిల్లా ఉప్పాడలో రంగులుగా మారిన సముద్ర తీరం

కొత్తపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో సముద్రం బుధవారం రంగురంగులుగా దర్శనమిచ్చింది. ఇటీవల వర్షాలు కురవడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు వివిధ పాయల ద్వారా సముద్రంలోకి చేరుతోంది. అక్కడి నుంచి నుంచి బురద నీరు నేరుగా సముద్రంలోకి ప్రవేశించడంతో నీలి రంగులో ఉండే సముద్రం సగభాగం బురద, కొంచెం మేర నీలి రంగు, మరి కొంత భాగం తెలుపురంగులో దర్శనమిస్తోంది. రంగులుగా దర్శనమిస్తున్న సముద్రాన్ని పర్యాటకులు, ప్రయాణికులు ఆసక్తిగా తిలకిస్తూ ఫొటోలు తీసుకుంటున్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

22 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.15 లక్షల నగదు స్వాధీనం


రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

రాజానగరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నామవరంలో ఇటీవల జరిగిన చోరీ కేసుకు సంబంధించి నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. ఈమేరకు రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నామవరం గ్రామానికి చెందిన రేలంగి లోవరాజు ఈ నెల 2న కుటుంబ సభ్యులతో కలిసి కాకినాడ జిల్లా తుని మండలం తలుపులమ్మ లోవ అమ్మ వారి దర్శనానికి బయలుదేరి వెళ్లి తిరిగి రాత్రికి ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన లోవరాజు లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళాలు బద్దలు కొట్టి 22 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.75 లక్షల నగదును దొంగలు అపహరించినట్టుగా గుర్తించారు. లోవరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేపట్టారు. సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్‌కు అందిన సమాచారం మేరకు రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీ గ్రామానికి చెందిన నలబా సత్యనారాయణ, రాజవోలు గ్రామానికి చెందిన బెదంపూడి రత్నరాజు, ఇనకోటి పవన్‌కుమార్‌ను బుధవారం అరెస్టు చేసినట్టు డీఎస్పీ వెల్లడించారు. చోరీకి గురైన బంగారు ఆభరణాలతో పాటు రూ. 1.15 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామ న్నారు. నిందితులను పట్టుకున్న సీఐ ప్రసన్న వీ రయ్య గౌడ్, సీసీఎస్ సీఐలు శ్రీధర్‌కుమార్, బలసౌరి, ఎస్‌ఐలు కే.నాగార్జున, సిబ్బంది అ మ్మిరా జు, సత్యనారాయణ, కరీం, సురేష్, మురళీ, ప్ర సాద్, రమణ, శివరామకృష్ణను అభినందించారు.

జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు అప్పన్న ఎంపిక

అమలాపురం టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు కోనసీమ జిల్లా అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ సీనియర్ పవర్ లిఫ్టర్ బి.అప్పన్న ఎంపికైనట్టు జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆగస్టు 2 నుంచి 7వ తేదీ వరకు కేరళలోని కోసిఘడ్‌లో జరిగే మాస్టర్స్, నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు రాష్ట్రం నుంచి అప్పన 120 కిలోల విభాగంలో ఎంపికయ్యారు. అప్పన్నను బుధవారం స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో గారపాటిచంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అభినందించి సత్కరించారు. మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, మట్టపర్తి వెంకటసముద్రం, గంగుమళ్ల దొరబాబు, యనమదల పల్లంరాజు, నక్కా సుధాకర్‌బాబు, వీరేంద్ర పాల్గొన్నారు.


అప్పన్నను అభినందిస్తున్న జిమ్ సభ్యులు

గొల్లప్రోలులో వైసీపీకి గట్టి షాక్

- డిప్యూటీ సీఎం పవన్ ప్రతిపాదించిన పనులను అడ్డుకున్న వైసీపీ పాలకులు
- గొల్లప్రోలు కౌన్సిల్‌ను పక్కనపెట్టి ఆమోదించిన కాకినాడ జిల్లా కలెక్టర్
- మున్సిపల్ చట్టంలోని విచక్షణాధికారాన్ని వినియోగించుకుంటూ గ్రీన్‌సిగ్నల్
- పనుల నిర్వహణకు తొలగిన అడ్డంకి

'ఆంధ్రజ్యోతి'లో కథనం..



గొల్లప్రోలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు నగర పంచాయతీ వైసీపీ పాలకులకు గట్టి షాక్ తగిలింది. పట్టణాభివృద్ధి కోసం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెచ్చిన నిధులతో పనులు చేపట్టకుండా రెండు నెలలుగా అడ్డంకు లు సృష్టిస్తున్న ఆ పార్టీ ప్రజా ప్రతినిధుల తీరుకి చెక్ పెడుతూ కాకినాడ జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం తనకు సంక్రమించిన విచక్షణాధికారాలను వినియోగించుకుంటూ పనులకు పరిపాలనామోదం ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పనులు చేపట్టేందుకు వీలు ఏర్పడింది. గ్రామాల అభివృద్ధికి పు ష్కలంగా నిధులు సాధించడంతో పాటు పనులు వేగంగా జరుగుతుండడంతో పట్టణాల అభివృద్ధిపై దృష్టి పెట్టిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకుని పిఠాపురంలో అభివృద్ధి పనుల నిర్వహణ నిమిత్తం రూ.3 కోట్లు, గొల్లప్రోలుకు రూ.కోటి మంజూరు చేయించారు. ఈ నిధులతో ఆయా పట్టణాల పరిధిలో అత్యవసరంగా చేపట్టాల్సిన రోడ్లు, డ్రైన్లు, ఇతర పనులను ప్రతిపాదించారు. ఈ పనులు చేపట్టేందుకు ఇప్పటికే పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలపడంతో పాటు టెండర్లు పిలిచారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నారు. అయితే గొల్లప్రోలు పట్టణంలో అందుకు విరుద్ధమైన పరిస్థితి నెలకొంది.

తొలి నుంచీ ఆటంకాలే..

కలెక్టర్ సూచనలకు అనుగుణంగా గొల్లప్రోలు పట్టణానికి మంజూరైన రూ.కోటితో వివిధ ప్రాంతాల్లో 27 రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణ పనులు ప్రతిపాదించి మే 29న జరిగిన గొల్లప్రోలు నగర పంచాయతీ సాధారణ, అత్యవసర సమావేశాల్లో కమిషనరు కనకరావు టేబుల్ అజెండాగా తీసుకురాగా వైసీపీ చైర్‌పర్సన్, పాలకవర్గం అభ్యంతరం తెలిపి వాయిదా వేశారు. అయితే టేబుల్ అజెండాను మినిట్స్ బుక్‌లో కూడా నమోదు చేయలేదు. జూన్‌లో వాయిదా వేసిన అంశాన్ని అజెండాకు రానివ్వకుండా చేసేందుకు కమిషనరు పంపిన అజెండాపై చైర్‌పర్సన్ సంతకం చేయలేదు. దీంతో జూన్ నెలలో సమావేశమే నిర్వహించలేకపోయారు. నిధులు మంజూరై మూడు నెలలు గడిచినా పనులు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది.

నగర పంచాయతీలో వైసీపీ పాలకవర్గం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెచ్చిన కోటి రూపాయల నిధులతో ప్రతిపాదించిన పనులకు ఆమోదం తెలపకుండా అడ్డంకులు సృష్టిస్తున్న విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 2న కథనం ప్రచురితమైంది. ఇదే విషయాన్ని నగర పంచాయతీ కమిషనరు కనకారావు కలెక్టర్ షాన్ మోహన్‌కు నివేదించారు. ఈ నేపథ్యంలో ఏపీ మున్సిపల్ చట్టం 1965లోని సెక్షన్ 68 కింద విచక్షణాధికారాన్ని వినియోగించుకుంటూ రూ.కోటితో 27 పనులు చేపట్టేందుకు పరిపాలనా ఆమోదం ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇవి బుధవారం గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయానికి చేరాయి. ఇదే విషయంపై కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపారు. కలెక్టర్ ఆదేశాలపై కౌన్సిల్‌కు సమాచారం ఇచ్చి పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

వైసీపీ సమావేశ ఏర్పాట్లలో విద్యుదాఘాతం

ఇద్దరికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న సురేష్, రాజు

సామర్లకోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ శివారులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలు నందు బుధవారం సాయంత్రం పెద్దాపురం నియోజకవర్గ వైసీపీ విస్తృత స్థాయి సమావేశపు ఏర్పాట్లలో భాగంగా వైసీపీ నాయకులు ఫ్లెక్సీలను రోడ్డు పక్కన నిలబెడుతుండగా గాలి వాటానికి విద్యుత్ తీగెలను ఫ్లెక్సీ బోర్డు తాకడంతో విద్యుద్ఘాతానికి ఫ్లెక్సీ బోర్డు పట్టుకున్న వైసీపీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్, భాస్కర్‌నగర్‌కు చెందిన కార్యకర్త రంపా రాజు తీవ్రంగా గాయపడ్డారు. ఫంక్షన్ హాలులో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు వారిద్దరికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి ఏడీబీ రోడ్డులోని మెడికవర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని మెడికవర్ వైద్యులు చెప్పారు.

డ్వాక్రా సొమ్ము రూ.20లక్షలు స్వాహా

ఇద్దరు యానిమేటర్ల అరెస్టు

అమలాపురం రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళలు వివిధ రకాల రుణాలను బ్యాంకు నుంచి తీసుకున్నారు. క్రమం తప్పకుండా నెలనెలా బ్యాంకుకు వాయిదాలు చెల్లించేందుకు డ్వాక్రా యానిమేటర్లను నమ్ముకున్నారు. వారిలో అత్యధికులు కూలి పనులకు వెళ్లేవారు నిరక్షరాశ్యులు కావడంతో వారు చెల్లించిన లక్షలాది రూపాయల నగదును స్వాహాచేసి చేతులెత్తేశారు. నగదు స్వాహా వ్యవహారం ఈ ఏడాది జనవరిలోనే వెలుగు చూసింది. అయితే స్వాహా చేసిన సొమ్ములు తిరిగి చెల్లిస్తామని నమ్మించి మళ్లీ మోసానికి పాల్పడ్డారు. చివరకు డ్వాక్రా మహిళల ఫిర్యాదుతో మోసానికి పాల్పడ్డ యానిమేటర్లు కటకటాల పాలయ్యారు. కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మి గ్రామంలో డ్వాక్రా మహిళలు చెల్లించిన రూ.20 లక్షలు పైబడి నిధులను అదే గ్రామానికి చెందిన విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్(వీవోఏ)లు స్వాహా చేశారు. నిధులు స్వాహా చేసిన డ్వాక్రా యానిమేటర్లు (వీవోఏ) కొల్లు వెంకటలావణ్య, బొక్కా కనకమహాలక్ష్మిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు బుధవారం తెలిపారు. గ్రామంలో సుమారు 90 డ్వాక్రా సంఘాల్లోని మహిళలు స్త్రీనిధి రుణాలతో పాటు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, బ్యాంకు లింకేజీ రుణాలను తీసుకున్నారు. వాటిని క్రమం తప్పకుండా నెలనెలా యానిమేటర్లయిన లావణ్య, కనకమహాలక్ష్మికి బ్యాంకులో జమ చేసేందుకు చెల్లించారు. అయితే చెల్లించిన సొమ్ములు బ్యాంకుకు జమ కావడం లేదని గుర్తించిన డ్వాక్రా మహిళలు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ శాఖ అధికారుల బృందాలు దఫదఫాలుగా విచారణ జరిపి రూ.20లక్షలు పైబడి నిధులు స్వాహా జరిగినట్టు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఎప్పటికప్పుడు ఆ సొమ్ములు చెల్లిస్తామని చెబుతూనే యానిమేటర్లు కాలం వెళ్లదీశారు. చివరకు డ్వాక్రా మహిళల ఫిర్యాదు మేరకు యానిమేటర్లు లావణ్య, కనకమహాలక్ష్మిని అరెస్టు చేసి అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరిచారు. వారికి రిమాండు విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఎస్‌ఐ శేఖర్‌బాబు తెలిపారు.

మంచి భర్త.. నాన్నను కాలేకపోయా.. సారీ!

లెటర్ రాసి రిపోర్టర్ ఆత్మహత్య


మెట్ల కుమార్ (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): మంచి నాన్నను కాలేకపోయాను..మంచి భర్తను కాలేకపో యాను.. మంచి కొడుకును కాలేకపోయాను.. సారీ అంటూ ఒక వ్యక్తి క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన మెట్ల కుమార్ (45) గత దశాబ్ద కాలంగా జర్నలిజంలో ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ప్రముఖ దిన పత్రికలో గత ఎనిమిదేళ్లుగా క్రైమ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య గౌరి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాజమహేంద్రవరం బొమ్మూరు నేతాజీ నగర్‌లోని ఎర్రన్నాయుడు హిందీ కళాశాల సమీపంలో అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నారు. ఇంట్లో మనస్పర్థల కారణంగా గత నెల 23న ఉదయం 11 గంటల సమయంలో బయటకు నడుచుకుంటూ వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా బుధవారం సాయంత్రం రైల్వే క్వార్టర్స్ రోడ్డులోని ఆలయానికి వచ్చిన వారికి దుర్వాసన రావడంతో 112కు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు వచ్చి పరిశీలించి మృతదేహం మెట్ల కుమార్‌దిగా గుర్తించారు. మృతదేహం పూర్తిగా పాడైంది. మెట్ల కుమార్ బంధువులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో కుటుంబీకులు బోరున విలపించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం మెట్ల కుమార్ మృతదేహాన్ని బంధువులకు అప్పగిస్తారు. అయితే కుమార్ బిర్యానీలో గడ్డిమందు కలిపి తిని ఆత్మహ్యాకు పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

జేబులో బుక్..

మృతదేహం సమీపంలో తన జేబులో పెట్టుకునే పాకెట్ బుక్‌ను కవర్‌లో పెట్టి దారంతో కట్టి ఉండడాన్ని గమనించి పోలీసులు ఆ బుక్‌ను ఓపెన్ చేసి చూస్తే అందులో కుమార్ తన కుటుంబీకుల కోసం రాసుకున్న ఆఖరి అక్షరాలు కనిపించాయి. మంచి భర్తను కాలేకపోయాను ఐ లవ్ యూ గౌరి అని భార్యను, మంచి నాన్న కాలేకపోయాను ఐ లవ్ యూ చిట్టితల్లి అని కుమార్తెను, బాబు జశ్వంత్ అమ్మను చెల్లిని జాగ్రత్తగా చూసుకో అని కుమారుడుని, మంచి కొడుకును కాలేకపోయానని తన తల్లిదండ్రుల ను, మంచి అల్లుడిని కాలేకపోయాను అని మావయ్యను ఉద్దేశించి సారీ అని రాసి ఉంది. నా వాటా ఆస్తిని నా పిల్లలకు చెందేలా చేయాలని చివరిగా రాసుకున్నాడు. బుక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రత్తిపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలోని అద్దేపల్లి అచ్యుతరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వతరగతి విద్యార్థి గొంతు రెడ్డి విజయ్‌కుమార్ (14) అదృశ్యమయ్యాడు. ధర్మవరంలోని సీతంపేటకు చెందిన విజయకుమార్ ఇంటిలో గొడవపడి వెళ్లిపోయినట్టు బుధవారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి ఆచూకీతెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

డాక్టర్ లేరు... అంబులెన్స్ రాలేదు

వైద్యం అందక ఆరేళ్ల బాలుడి మృతి


బాలుడిని ఎత్తుకుని ఆసుపత్రి ప్రాంగణంలో కుటుంబ సభ్యులు


మరణించిన బాలుడు

ఎటపాక, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఫిట్స్ వచ్చిన ఆరేళ్ల బాలుడికి వైద్యం అందక, అటు 108 అంబులెన్స్ సమయానికి రాక మృతిచెందిన ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం బండిరేవు గ్రామంలో జరిగింది. బండిరేవుకు చెందిన నూపా జయదేవ్ (6) గత 3 రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. బుధవారం సాయంత్రం బాలుడికి ఫిట్స్ రావడంతో కుటుంబ సభ్యులు సమీపంలోని లక్ష్మీపురం పీహెచ్‌సీకి వైద్యం కోసం తీసుకొచ్చారు. ఆ సమయంలో వైద్యాధికారిణి అందుబాటులో లేకపోవడంతో వైద్యాధికారిణి సూచనలతో అక్కడి సిబ్బంది బాలుడికి 2 గంటల పాటు వైద్యం చేశారు. బాలుడిని కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించాలని భావించి 108 అంబులెన్స్‌ను సంప్రదించారు. అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో చివరకు కూనవరం నుంచి 108 అంబులెన్స్ అందుబాటులోకి లభించింది. దాంతో అక్కడి నుంచి లక్ష్మీపురానికి ఆలస్యంగా రావడంతో బాలుడి ఆరోగ్య పరిస్థితి విష మించి మృతిచెందాడు. లక్ష్మీపురం పీహెచ్ సీ వైద్యాధికారిణి అందు బాటులో లేకపోవ డంతోనే తమ బాలుడి మృతి చెందాడని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయమై పీహెచ్‌సీ వైద్యాధికారిణి గౌతమిని వివరణగా కోరగా బాలుడు జయదేవ్‌కు గుండె సమస్య ఉందని, ఇతరత్రా చోట్ల వైద్యం అందిస్తున్నారని, బాలుడి ఆరోగ్య పరిస్థితి విషయంగా ఉన్నప్పుడే తీసుకువచ్చారని, చికిత్స అందిస్తునే మెరుగైన వైద్యానికి తరలించే క్రమంలో మృతిచెందాడని పేర్కొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి


సంఘటనా స్థలంలో సుభాష్ మృతదేహం, (ఫైల్)



రావులపాలెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న యువకుడిని లారీ ఢీకొనడంతో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం గంటి చిన్నపేటకు చెందిన యడ్ల సుభాష్(24) బుధవారం రావులపాలెం వైపు నుంచి గోపాలపురం జాతీయ రహదారి సెంటర్ వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ బలంగా ఢీకొంది. దీంతో లారీ చక్రాల కింద నలిగి సుభాష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎం.శేఖర్‌బాబు తెలిపారు.

దుస్తులు ఆరవేయలేదని భర్త మందలింపు

భార్య ఆత్మహత్య

కొత్తపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భర్త మందలించాడనే మనస్తాపానికి గురైన భార్య ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని మృతిచెందిన్నట్టు ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం తాడిచెర్ల గ్రామానికి చెందిన మనల్లే నాగరవీంద్ర గత కొంత కాలంగా కోనసీమ జిల్లా రావులపాలెం సర్వే పామాయిల్ కంపెనీలో ఫీల్డ్‌ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. తన భార్య పావని(24), రెండేళ్ల కుమార్తెతో కలిసి కొత్తపేట బాబానగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి రవీంద్ర విధులు ముగించుకుని ఇంటికి రాగ తన భార్య పావనిని ఉతికిన దుస్తులు ఆరవేయలేదని మదలించాడు. దీంతో మనస్తాపానికి గురైన పావని పక్క గదిలో సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకుంది. చూట్టుపక్కల వారి సాయంతో తలుపులు పగలుకొట్టి భార్య పావనిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతిచెందిన్నట్టు ధ్రువీకరించారు. పావని తండ్రి కొండేపూడి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సురేంద్ర తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.70వేలు చోరీ

నిందితుడి అరెస్టు

యానాం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నగదును డ్రా చేసేందుకు ఏటీఎంకు వెళ్లిన రిటైర్డు పోలీసు ఉద్యోగిని బోల్తా కొట్టించి కార్డును మార్చి వేసి నగదును డ్రా చేసుకుని పరారైన నిందితుడిని బుధవారం యానాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ సుబ్బరాజు తెలిపిన వివరాల మేరకు... కాకినాడ జిల్లా పిఠాపురం వద్ద నందికిపురానికి చెందిన ప్రస్తుతం కాకినాడ రాయుడుపాలెంలో నివాసం ఉంటున్న కాసీబు రాంబాబును అదుపులోకి తీసుకున్నారు. గత నెల 28న యానాంలోని పిల్లా రాయవీధిలో గల ఎస్‌బీఐ ఏటీఎం నుంచి పోలీసు రిటైర్డ్ ఉద్యోగి పి.సత్యనారాయణ రూ.10 వేలు డ్రా చేశాడు. మినీస్టేట్మెంట్ కోసం ప్రయత్నించినా రాకపోవడంతో పక్కనే మాస్క్ పెట్టుకుని ఉన్న రాంబాబును తీయమని అడిగి కార్డుతో పాటు పిన్ నెంబరు చెప్పాడు. అయితే స్టేట్మెంట్ రావడంలేదని చెప్పి సత్యనారాయణకు తన వద్ద ఉన్న మరో ఏటీఎం కార్డును ఇచ్చాడు రాంబాబు. అది గ్రహించని సత్యనారాయణ ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం బైక్‌పై వెళ్లిన రాంబాబు సుంకరపాలెం వద్ద ఉన్న ఏటీఎంలో సత్యనారాయణ నుంచి తీసుకున్న కార్డు పెట్టి రూ.70వేలు విడతల వారిగా డ్రా చేశాడు. 30న బ్యాంక్‌కు వచ్చిన సత్యనారాయణ పాస్‌బుక్ వివరాలు నమోదు చేయించుకోగా రూ.70వేల మేరకు నగదు డ్రా అయినట్టు గమనించి పోలీసులును ఆశ్రయించాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు, క్రైం సిబ్బంది దుర్గారావు, గణేష్, జాంటీలతో కలిసి ఏటీఎం సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి నిందితుడిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి ఏటీఎం కార్డు, రూ.1000 నగదు, బైక్ స్వాధీనం చేసుకుని యానాం కోర్టులో హాజరుపరిచారు. నిందితుడు రాంబాబుపై విశాఖపట్నంలోని దువ్వాడ, కాకినాడలోని సర్పవరంలో 7 కేసులు ఉన్నట్టు గుర్తించారు.

ఆర్టీసీ బస్సులు ఢీకొని ఆరుగురికి గాయాలు

ముమ్మిడివరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును మరో ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం సమీపంలో జరిగింది. కాకినాడ నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆర్టీసీ బస్సు ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం సమీపంలో ఆవు అడ్డు రావడంతో సడెన్ బ్రేక్ వేయగా వెనుక నుంచి వస్తున్న మరో ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సులోని ఆరుగురు ప్రయాణికులు గాయపడగా కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FINANCE

గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/ రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668

AJD:207846

WANTED

కాకినాడ మెయిన్ రోడ్డులో Jewelary & Textile షోరూంలో పనిచేయుటకు Computer Oprater కావలెను. డేటా ఎంట్రీ సిస్టమ్ ఆపరేటింగ్‌లో అనుభవం కలవారికి ప్రాధాన్యత శాలరీ రూ.22,000/- మరియు షాపులో పనిచేయుటకు సిబ్బంది కావలెను. Qly. Inter రూ.18వేలు, డిగ్రీ రూ.20వేలు మరియు కాకినాడలో ఒక ఇంట్లో వంట, ఇంటిలో పనులు చేయుటకు 35సం॥ల లోపు ఆడ వంట మనిషి కావలెను. జీతం రూ.20వేలు కాకినాడ పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. Cont 6301943220, 8008440189

AJD:244763

4 Lines CLASSIFIED Rs.230/- Only

సమ్మె సక్సెస్!

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, పలు డిమాండ్లతో కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల ధర్నాలు, నిరసనలు చేపట్టారు.


వై.రామవరంలో మానవహారం నిర్వహిస్తున్న వర్కర్లు



రాజమహేంద్రవరంలో సమ్మె నిర్వహిస్తున్న నాయకులు


ప్రత్తిపాడులో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం కార్యకర్తలు


ముమ్మిడివరం బైపాస్ రోడ్డులో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాలు


మండపేట: సమ్మెలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు


పిఠాపురంలో ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 33/11కేవీ నాగులాపల్లి, యండపల్లి, కొండెవరం ఫీడర్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన చెప్పారు.


పెద్దాపురంలో సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రభాకరవర్మ


గొల్లప్రోలులో ప్రధాన రహదారిపై కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల మానవహారం



సామర్లకోటలో కార్మిక సంఘాల ప్రదర్శన

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నినదించిన కార్మిక సంఘాలు

సార్వత్రిక సమ్మె విజయవంతం

కరప, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తక్షణం రద్దు చేయాలని కార్మిక సంఘాల జిల్లా నాయకురాలు సీహెచ్ రమణి డిమాండ్ చేశారు. కరప తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు నిర్వహించిన ఆందోళనలో ఆమె మాట్లాడారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేసిన అనంతరం ర్యాలీగా బజార్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ భారీ మానవహారంగా ఏర్పడి ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. ఆయా సంఘాల నాయకులు పి.వీరవేణి, ఎం.వరలక్ష్మి, రెడ్డి వెంకటలక్ష్మి, విజయకుమారి, రాయుడు చిట్టిబాబు, పరశురామ్, పద్మ, రామకృష్ణ, టి.గంగాభవాని, పేపకాయల రాజబాబు, మహాలక్ష్మి, పి.రాజు, శ్రీలక్ష్మి, సత్య, అనుసూరి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం లేబర్ కోడ్‌ల అమలుకు ప్రయత్నం చేస్తూ కార్పొరేట్ ఎజెండా అమలు చేస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ప్రభాకరవర్మ విమర్శించారు. సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల ఉపాధ్యక్షురాలు దాడి బేబి అధ్యక్షతన పట్టణంలో సమ్మె నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి క్రాంతికుమార్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంఎస్‌వీ మూర్తి, జాన్ కెనడీ, సూరిబాబు, ఎల్ఐసీ యూనియన్ నాయకులు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నీలపాల సూరిబాబు మద్దతు తెలిపారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి పుర వీధుల్లో ప్రదర్శనగా తిరిగి తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా జరిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, కార్యదర్శి కుంచే చిన్నా, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు ప్రధాన రహదారిపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు మానవహారం నిర్మించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. సీఐటీయూ నాయకులు ఓరుగంటి నందీశ్వరుడు, సీహెచ్ పద్మ, తులసిదేవి, పద్మకుమారి, ప్రభావతి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నినాదాలు చేశారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు పి.గిరిధర గోపాలరావు, బి.శ్రీనివాసు, వి.కొండలరావు, అప్పలరాజు, వి.ఎస్తేరురాణి, నాగమణి, సత్యసుందరి, ఫాతిమా, ప్రసాదరావు, వరలక్ష్మి, అమలావతి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవులో సీపీఎం నేత టేకుమూడి ఈశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజా సంఘాల కార్మికులు ర్యాలీ నిర్వహించి తహసీల్దారు, ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందించారు. సీపీఎం నేతలు, యానిమేటర్లు, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, సహకార సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కరప, తాళ్లరేవుల్లో తహసీల్దారు కార్యాలయాల ఎదుట నినాదాలు చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు



పంచాయతీల పురోగతికి కార్యాచరణ ప్రణాళిక

కరప, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల పురోగతికి కచ్చితమైన డేటాతో అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, డిప్యూటీ ఎంపీడీవో నలాది వెంకటశ్రీనివాసరావు సూచించారు. స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో బుధవారం వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి సిబ్బందికి ఏర్పాటుచేసిన ఒకరోజు శిక్షణ శిబిరంలో వారు మాట్లాడారు. పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు తదితర తొమ్మిది థీమ్స్, 147 ఇండికేటర్స్‌కు సంబంధించిన పూర్తి డేటాను అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ నివేదిక ఆధారంగా పంచాయతీల గ్రేడింగ్, మౌలిక స్వరూపం తెలుస్తుందని, దీన్ని బట్టి గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు మార్గం సుగమం అవుతుందని, కేంద్రం నుంచి నిధుల లభ్యతకు ఆస్కారం కలుగుతుందన్నారు. అనంతరం సిబ్బందికి ప్రశ్నావళితో కూడిన పరీక్ష నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు. మాస్టర్ ట్రైనీలు రామ్‌జీ హీరాలాల్, షేక్ అహ్మద్‌షా, ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి, ఏవో బీఎల్ నరసింహం, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, హౌసింగ్ ఏఈలు వర్ధన్, శైలజ, నాగేష్, ఏపీవో హేమమాధవి, ఏపీఎం దేవి, వైద్యాధికారిణులు ఏంజెలిన్, అఫ్రోజ్, అనూష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


కరపలో శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.హిమమహేశ్వరి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ అడ్వాన్స్ ఇండెక్స్‌పై (బీపీడీపీ, జీపీడీపీ) పంచాయతీల కార్యదర్శులు, ఏఎన్ఎంలు, డేటా ఎంట్రీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈవోపీఆర్డీ భైరవమూర్తి, ఎంపీపీ బి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

పోలీసు కార్యాలయంలో మెగా మెడికల్ క్యాంపు

కాకినాడ క్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని కన్వెన్షన్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంపును ఎస్పీ జి.బిందుమాధవ్ ప్రారంభించారు. కాకినాడ మెడికవర్ హాస్పిటల్ డాక్టర్స్, ల్యాబ్ టెక్నీషియన్లు పోలీస్ అధికారులు, సిబ్బందికి గుండె, కిడ్నీ, లివర్, బీపీ, షుగర్ తదితర 20 రకాల వైద్య పరీక్షలు చేశారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎంజేవీ భాస్కరరావు, అదనపు ఎస్పీ (ఏఆర్) ఎస్.శ్రీనివాసరావు, కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్‌పాటిల్, మెడికవర్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ వసంతకుమార్, జనరల్ మెడిసిన్ ఎండీ డాక్టర్ శుభాకర్‌రావు, సెంటర్ హెడ్ డాక్టర్ అభిషేక్, హాస్పిటల్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీసాయికి పంచామృతాలతో అభిషేకం, పల్లకీ సేవ

సామర్లకోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేషన్ సెంటర్లో గల ఆంధ్రా సాయి గీతా సమాజం షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి ఉత్సవాలు మొదలయ్యాయి. బుధవారం సాయంత్రం బాబావారి పల్లకీ సేవ నిర్వహించారు. ఉదయం బాబాను పంచామృతాలతో అభిషేకించారు. విశేష పుష్పార్చన పూజలు చేశారు. కాపుగంటి పైడిరత్నం ఆధ్వర్యంలో మహిళలు హనుమాన్ చాలీసా పారాయణ పూజలు జరిపారు. సాయి భక్తమండలి సత్తి అరుణ బృందంచే సాయిబాబా అష్టకం, విష్ణుసహస్రనామ పారాయణ గావించి బాబాకు 1100 పూరీలను నైవేద్యంగా సమర్పించారు. రాత్రి ఆలయ ఆవరణలో గుమ్మళ్ళ భవాని బృందం కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ కమిటీ ప్రతినిధులు దవులూరి సుబ్బారావు, దన్నాల అప్పారావు, గంధ్రోతుల సత్యనారాయణ, దుక్కా రాజబాబు, కొప్పన రాంబాబు భక్తులకు సేవలందించారు. గురువారం గురుపౌర్ణమి సందర్భంగా విశేష పూజలు జరిపి మహాన్నదానం నిర్వహిస్తామని అప్పారావు, రాంబాబు తెలిపారు.

'ప్రశ్నించేందుకు వైసీపీ కార్యకర్తలు సన్నద్ధం కావాలి'

సామర్లకోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో బుధవారం సాయంత్రం వైసీపీ పెద్దాపురం నియోజకవర్గ విస్తృత సమావేశం ఆ పార్టీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు అధ్యక్షతన నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను, మోసపు మాటలను నిలదీసి ప్రశ్నించేందుకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. సమావేశంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, దాట్ల సూర్యనారాయణరాజు, ఆవాల లక్ష్మీనారాయణ, జాన్‌మోజెస్, బొడ్డు లక్ష్మీమంగతాయారు, తలారి దొరబాబు పాల్గొన్నారు.

'బూత్ స్థాయి అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి'

కాకినాడ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఎస్.మల్లిబాబు పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్ స్థాయి అధికారులకు వారం రోజుల శిక్షణను బుధవారం ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఫారం-6, 6ఎ, 7, 8ల్లో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి దరఖాస్తుదారుల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించడం, వాటిపై ఫీల్డ్ వెరిఫికేషన్ చేయడానికి క్షేత్ర స్థాయి సందర్శన, ఆ తర్వాత నివేదికను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి సమర్పించడం చేయాలన్నారు. ఇంటింటికీ తిరిగి బదిలీ అయిన, మారిన, వలస వచ్చిన, మరణించిన నకిలీ ఓటర్ల పేర్లను గుర్తించాలన్నారు. తమకు కేటాయించిన పార్ట్‌కు సంబంధించిన ఓటర్ల జాబితాలను తరుచుగా సందర్శించా లని, ప్రజలు, పెద్దలు, ఎన్నికైన ప్రజాప్రతిని ధులతో సంభాషించాలన్నారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లతో ముసాయిదా ఓటర్ల జాబితా పరిశీలన చేయాలన్నారు. పోస్టాఫీసు నుంచి తిరిగి వచ్చిన ఎన్నికల గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలన్నారు.జాబితా నుంచి పేర్ల తొలగింపుపై అభ్యంతరాలు స్వీకరించిన ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని, నివేదికలు, ఫారంలను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి సమర్పించాలన్నారు. జిల్లా నోడల్ అధికారి, దేవదాయ శాఖ డిప్యూటీ కలెక్టర్ భారతి, కాకినాడ రూరల్ తహసీల్దారు ఎస్ఎల్ఎన్ కుమారి, డిప్యూటీ తహసీల్దారు సురేష్ పాల్గొన్నారు.

'జగన్‌కు రైతులు, ప్రజల మద్దతు లేదు'

పెద్దాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జగన్‌కు రైతులు, ప్రజల మద్దతు లేదని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించడానికే జగన్ పర్యటనలు చేస్తున్నారన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్సుకు నూతన చైర్లు

పిఠాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్సులో ప్రయాణికుల సౌకర్యార్థం అత్యాధునిక చైర్లు ఏర్పాటు చేశారు. బుధవారం వాటిని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, పాదగయ మాజీ చైర్మన్ కొండేపూడి సూర్యప్రకాష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.


పిల్లవాడికి నగదు అందజేస్తున్న జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసరావు

పవన్ జీతం... అనాథ పిల్లలకు

42మందికి రూ.2.10 లక్షలు అందజేత

పిఠాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు లేని పిల్లలకు అండగా నిలుస్తానని ప్రకటించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాట నిలబెట్టుకున్నారు. వరుసగా మూడవ నెల పిఠాపురం నియోజకవర్గంలోని 42 మంది అనాథ పిల్లలు ఒక్కొక్కరికి రూ.5వేలు వంతున రూ.2.10 లక్షలను పవన్ పంపారు. జనసేన పిఠాపురం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఇతర నాయకులు బుధవారం పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీ, చిత్రాడ తదితర ప్రాంతాల్లో పిల్లల ఇళ్లకు వెళ్లి రూ.5వేలు వంతున అందజేయగా... మిగిలినచోట్ల ఆయా ప్రాంతాల నేతలు పంపిణీ చేశారు. గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, జనసేన నాయకులు, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.


సూరంపేటకు వెళ్లే బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న పాడా పీడీ చైత్రవర్షిణి

'బ్రిడ్జి నిర్మాణం 15 రోజుల్లో పూర్తి చేయాలి'

గొల్లప్రోలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని సూరంపేటకు వెళ్లేందుకు చేపట్టిన బ్రిడ్జి నిర్మాణాన్ని 15 రోజుల్లోగా పూర్తి చేయాలని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్, ఇరిగేషన్ అధికారులతో కలిసి బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించారు. పనులు ఆలస్యం కావడంపై కలెక్టర్ అసంతృప్తితో ఉన్నారన్నారు. వరద నీటికి గట్లు కొట్టుకుపోకుండా ఉండేందుకు ఇరిగేషన్ అధికారుల సలహాలు తీసుకుని తిరిగి అంచనాలు రూపొందించాలని సూచించారు. ముంపు లేకుండా ఉండేందుకు అవసరమైతే తూరలు తొలగించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్మాణంలో జాప్యం ఉండరాదని స్పష్టం చేశారు. పబ్లిక్‌హెల్త్, ఇరిగేషన్ ఈఈలు గంగరాజు, శేషగిరిరావు, తహసీల్దారు పీవీ గోపాలకృష్ణ, నగర పంచాయతీ కమిషనరు కనకారావు, ఎంపీడీవో కర్రి స్వప్న, పీబీసీ డీఈఈ సంతోష్‌కుమార్, ఏఈఈ పద్మజ పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాలనతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు'

కాకినాడ రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు సతీమణి నాగజ్యోతి అన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని కాకినాడ కార్పొరేషన్ ఒకటో డివిజన్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నాగజ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలతో కలిసి ఇంటింటికీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పేరాబత్తుల లోవబాబు, పాలిక ఉషారాణి, త్రిమూర్తులు, టీడీపీ నాయకులు భవానీ, లక్ష్మి, అర్జున్, వాసు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై
దాడికి ఖండన

కాకినాడ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గంలో విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి పాల్పడిన వైసీపీ మూకలపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.స్వాతిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు డి.అంజిబాబు, జిల్లా కార్యదర్శి డి.అర్జున్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అడపా వెంకటరావు డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై జరిగే దాడులను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించాలన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్ట్‌పై వైసీపీ మూకలు దాడిచేయడం దారుణమని ఏపీయూడబ్ల్యుజే కాకినాడ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు డీహెచ్‌వీ సాంబశివరావు పేర్కొన్నారు. వైసీపీ మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి సూచనలు, సైగల మేరకు చిత్తూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి సమక్షంలోనే ఫొటో జర్నలిస్ట్‌పై వైకాపా శ్రేణులు దాడిచేయడం ఆపార్టీ చేతకానితనానికి నిదర్శనమన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

పిఠాపురం రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందరాడలో ఇద్దరు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూ శ్మశానవాటికలో నీటి సదుపాయం

పిఠాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రం చెంతనే ఉన్న హిందూ శ్మశానవాటికలో దాతల సౌజన్యంతో నీటి సదుపాయం కల్పించారు. అంతిమ సంస్కారాల నిమిత్తం వచ్చేవారు స్నానాలు చేసేందుకు తగిన సౌకర్యాలు, నీటి సదుపాయం లేకపోవడాన్ని గుర్తించి మన ఊరు మన బాధ్యత సంస్థ ప్రతినిధులు స్వర్గీయ చెక్కా నూకరాజు కుటుంబసభ్యులను సంప్రదించారు. దీంతో వారు ముందుకు వచ్చి లక్ష రూపాయలతో ట్యాంకుతో పాటు నీటి సదుపాయం కల్పించారు. దీనిని కమిషనరు నామా కనకారావు ప్రారంభించి దాతలను అభినందించారు. కార్యక్రమంలో మన ఊరు మన బాధ్యత అధ్యక్ష, కార్యదర్శులు కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్, చెక్కా వెంకట సుబ్రహ్మణ్యశ్రేష్ఠి, నాగేశ్వరరావు, మాణిక్య నాగభూషణం పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఆదర్శ ఫీడర్ పరిధిలో కరెంటు లైన్ల నిర్వహణ, చెట్లు కొమ్మల తొలగింపులో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ ప్రభాకర్ తెలిపారు. దత్తాత్రేయుడి గుడి వీధి, కుమ్మరి వీధి, తారకరామానగర్, వైఎస్ఆర్ గార్డెన్స్, బొజ్జావారితోట, మాధవపురం రోడ్డు, లయన్స్ కల్యాణ మండపం, అన్నపూర్ణ థియేటర్, మాధవనగర్ మసీదు, సాయిదత్తనగర్, ఎల్ఐసీ వీధి, డ్రైవర్స్ కాలనీ, అయితేనగర్, ఏడు కాలువలు, గోర్స రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విద్యుత్ సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ప్రభాకర్ తెలిపారు. అన్నపూర్ణమ్మ ఆలయం ఫీడర్, వీర్రాఘవపురం, విఘ్నేశ్వర థియేటర్, మఠం సెంటర్, కొత్తూరు, నిమ్మతోట, సంపంగితోట, తాండ్ర పాపారాయుడు విగ్రహం ఏరియా, వెలంపేట, గణపతినగరం, 11కేవీఏ రైల్వేస్టేషన్ ఫీడర్, పాత్రుల వీధి, చిన్న వీధి, బళ్ళ మార్కెట్, గాంధీబొమ్మ సెంటర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): ఇంజరం విద్యుత్ సబ్ స్టేషన్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో మెయింటెనెన్స్‌లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ ఎన్.ఉదయభాస్కర్ తెలిపారు. సుంకరపాలెం, ఉప్పంగల, లచ్చిపాలెం ఏరియాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ

టెండర్ కం బహిరంగ కౌలు వేలం పత్రికా ప్రకటన

కాకినాడ జిల్లా, పిఠాపురం మండలం మరియు పట్టణంలో గల శ్రీ సంస్థానం సత్రంకు కొండంగి మండలం, ... [illegible] ... 2025-26 నుండి 2027-28 వరకు 3 సంవత్సరములు ... దీ. 14-07-2025 నుండి దీ.19-07-2025వరకు (6 రోజులు) ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుండి ... [illegible]

వ.నెం	సర్వే నెం.	విస్తీర్ణం ఎ.లు	వ.నెం	సర్వే నెం.	విస్తీర్ణం ఎ.లు	వ.నెం	సర్వే నెం.	విస్తీర్ణం ఎ.లు
1.	535	8-00	5.	553	196-90	9.	565	41-00
2.	545	20-20	6.	690	54-98	10.	538,565	7-00
3.	549	50-55	7.	623	6-80	11.	553,538	10-00
4.	538	78-94	8.	621	4-09			

మరిన్ని వివరములకు సెల్ నెంబరు 9121864089 నందు కాని, పిఠాపురం సత్రం ఆఫీసు పనివేళలలో కాని తెలుసుకొనవచ్చును.
పిఠాపురం
దీ.9-7-2025
సన్న శ్రీరాములు
కార్యనిర్వహణాధికారి శ్రీ సంస్థానం సత్రం

టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

శ్రీభానులింగేశ్వర స్వామివారి దేవస్థానం, భానుగుడి కాకినాడ కాకినాడ జిల్లా, కాకినాడ నగరంలో శ్రీభానులింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో భక్తులు సమర్పించు కొబ్బరి కాయలు సగభాగము చెక్కలు ప్రోగుచేసుకొను లైసెన్సు హక్కులకు ది.08-08-2025 నుండి 7-8-2026 వరకు అనగా ఒక సంవత్సరమునకు మరియు రెండోవ సంవత్సరము 08-08-2026 నుండి 7-8-2027 కాల పరిమితికి 10% పెంపుదలపై ది.21-7-25 ఉదయం 11 గంటలకు కార్యనిర్వహణాధికారి మరియు తనిఖీదారు, దేవదాయ ధర్మదాయశాఖ కాకినాడ వారి సమక్షంలో దేవస్థానం వద్ద టెండర్ కమ్ బహిరంగ వేలం పాటజరుగును.

పాట షరతులు: 1. ఈవేలంపాట శ్రీయుత ఉపకమీషనర్, దేవదాయశాఖ వారి కాకినాడ వారి ఉత్తర్వులను లోబడి జరుగును. 2.పాటలో పాల్గొను ప్రతి పాటదారుడు పాటకు ముందు తమ స్థిరాస్తులను తెలిపే సాల్వెన్సీ సర్టిఫికెట్ పాటు చూపవలెను. 3. పాటలో పాల్గొను ప్రతీ పాటదారుడు పాటకు ముందు కొబ్బరి చెక్కలకు రూ.30,000/-లు ప్రథమ ధరావత్తు చెల్లించు నిర్ణయం పాటలో పాల్గొను వారు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు మరియు ఆధార్ కార్డు సమర్పించవలెను. 4. హెచ్చు పాటదారు పాట ఖరారు చేసిన వెంటనే హెచ్చుపాట మొత్తము సంవత్సరము సొమ్ము చెల్లించవలెను. 5. ఏ కారణం చేతనైనా పాట నిలుపుటకు గాని రద్దు చేయుటకు గాని దేవస్థానం వారికి అధికారం కలదు. పాట ముగిసిన వెంటనే హెచ్చుపాట దారుడు ధరావత్తు తప్ప మిగిలిన వారి ధరావత్తు తిరిగి ఇవ్వబడును. 6. దేవస్థానందుకు బకాయి ఎట్టి లావాదేవీలు ఉన్నవారు పాటలో పాల్గొనుటకు అనర్హులు. 7. శ్రీస్వామివారి దేవస్థానం దేవదాయ ధర్మదాయశాఖకు చెందినందుకు హిందువులు మాత్రమే పాటలో పాల్గొనవలెను మిగిలిన వివరముల కొరకు ఆఫీసు పని వేళల యందు సంప్రదించవలెను.
కాకినాడ
తేది: 9-7-2025
కార్యనిర్వహణాధికారి

APSRTC
SHORT TENDER NOTICE
పల్లె వెలుగు

Tenders are invited through ONLINE ("www.tender.apeprocurement.gov.in") for 1. Improvements to In and Out Gates at Bus Station, Kakinada, Kakinada District. 2. Renovation of Inspection Pit at Bus Depot, Amalapuram, Dr.B.R.A.Konaseema District. 3. Providing Extension to the existing Parcel Office (Dispatch Unit) of size 30'x21' in new Bus Station at Eluru, Eluru District. 4. Providing Cement Concrete Pavement to the yard in between I & II Depot Gates in Bus Station at Nellore, SPSR Nellore District. 5. Construction of Basement walls and raising of flooring in Bus Body repair shed -2 of 60'x40' size in ZWS, Nellore, SPSR Nellore District. 6. Repairs and Improvements to the Bus Station Building at Pamidi in Ananthapuramu District. For full Tender Notice please visit "www.apsrtc.ap.gov.in". For Online participation please visit "https://tender.apeprocurement.gov.in". NOTE: Bid Document download Start Date & Time: 21.07.2025, 4.00 PM, Bid Submission Closing Date & Time : 28.07.2025, 4.00 PM. Further details: Ph. No: 9959224686 (10.00 AM to 5.30 PM). APSRTC reserves the right to cancel or reject any tender or all the tenders of this notification without assigning any reason at any stage.

NIT NO. 08/CCE/APSRTC/2025-26, Dt. 08-07-2025 — Chief Civil Engineer, APSRTC, Vijayawada

శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం, పిఠాపురం
దేవదాయ-ధర్మదాయశాఖ, పిఠాపురం టౌన్, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా

కాకినాడ జిల్లా, పిఠాపురం మండలం, పిఠాపురం పట్టణంలో వేంచేసిన శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం, పిఠాపురం, దేవస్థానమునకు 2025-2026 సంవత్సరమునకు అనగా ది.26-07-2025 నుండి ది.31-03-2026 వరకు (8 నెలల 6 రోజులకు) దేవస్థానం మరియు అన్నప్రసాదం, గోశాల నిమిత్తం, ఈ క్రింది వివరించిన అంశములు సప్లై చేయుటకు ది.25-07-2025 శుక్రవారం మధ్యాహ్నం 2.00గంటల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడుచున్నవి. సీలు వేసిన టెండర్ అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల సమక్షములో తెరువబడును.

వ. నెం	వివరములు	కాలపరిమితి	ధరావత్తు రూ.	టె.షె. ఖరీదు రూ.
1	కూరగాయలు సరఫరా (రైతు బజారు రేట్లు కన్నా తక్కువగాను మరియు ఎంత పర్సెంట్ తగ్గించి ఇస్తారో కోట్ చెయ్యాలి)	26-07-2025 టు 31-03-2026	25,000	500
2	శానిటరీ ఐటమ్స్	డిటో	10,000	500
3	స్టేషనరీ ఐటమ్స్	డిటో	10,000	500
4	పాలు మరియు పెరుగు1/2 లీటర్లు పాకెట్స్	డిటో	10,000	500
5	గోవులకు ఎండు గడ్డి సరఫరా,చిట్టు తవుడు, నూక కొంటు	డిటో	10,000	500

ముఖ్యషరతులు: 1.ఆసక్తి గల టెండరుదారులు టెండర్ షెడ్యూలు రూ.500/- నగదు చెల్లించి రశీదు పొందవలెను. 2.టెండర్ షెడ్యూల్ ది.22-7-2025 ఉదయం 10.00 గంటల నుండి ది.24-7-2025 సాయంత్రం 5:00 గంటల వరకు దేవస్థానం వద్ద విక్రయించబడును. టెండర్ దాఖలు చేయునపుడు టెండర్ షెడ్యూల్లో తెలిపిన విధముగా ప్రథమ ధరావత్తు వేరువేరుగా ఏదేని జాతీయ బ్యాంకు నందు కార్యనిర్వహణాధికారి శ్రీపాద శ్రీవల్లభ సేవ సంఘ్, పిఠాపురం వారి పేరున డి.డి తీసి లేదా నగదు రూపేణ గాని టెండర్ షెడ్యూల్‌తో జతపరచి పాల్గొనవలెను. 3.టెండర్ షెడ్యూల్‌తో పాటు ప్రొప్రైటర్ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, రిజిస్ట్రేషన్ డీలర్ సర్టిఫికేట్ మరియు ఫరమ్ జి.ఎస్.టి. సర్టిఫికేట్ కాపీ మరియు 3సం. ఇన్కమ్ టాక్స్ రిటర్న్ కాపీలు తప్పని సరిగా జతపరచవలెను. ఇవి మూడవసారి పిలుచుచున్న టెండర్లు, ఇతర టెండర్ షరతులు మరియు వివరములు కొరకు దేవస్థానం పనివేళలలో యందు తెలుసుకోనవచ్చును.

కార్యనిర్వహణాధికారి గ్రేడ్-1
శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం, పిఠాపురం

పంచాయతీ పురోగతి నివేదికల తయారీపై శిక్షణ

ప్రత్తిపాడు, జూలై 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీల పురోగతి సూచనలు 2.0 నివేదికల తయారీపై బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. శిక్షణా తరగతులను ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు సత్యప్రకాష్, ఈ.రాజబాబు, కాశీ విశ్వనాద్, జోకా అమృత, శ్రీనివాస్, కుమార్‌స్వామి పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



చింతూరు సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు

కార్మిక హక్కులు నెరవేర్చాలి

● సీఐటీయూ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు

ఎటపాక, జూలై 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతువ్యతిరేక చర్యలు మానుకుని, కార్మికహక్కులు నేరవేర్చాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఐ.వెంకటేశ్వర్లు అన్నారు. భారతబంద్ సందర్భంగా బుధవారం ఎటపాకలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి వైటీసీ కార్యాలయం వరకు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఐవీ మాట్లాడారు. లేబర్ కోడ్‌ని రద్దు చేయాలని, పదిగంటల పనిదినాలను 8గంటలకు తగ్గించాలన్నారు. స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేటీకరణ ఆపాలన్నారు. అనంతరం తహసీల్దార్ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమం లో సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, డేగల మాధవరావు, పులుసు బాలకృష్ణ, ఆకిశెట్టిరాము, పొడియం రత్తమ్మ, పద్మ పాల్గొన్నారు.

'కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి'

చింతూరు: అన్నిరంగాల కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనంగా నెలకు రూ.26వంతున చెల్లించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం చింతూరులో వివిధ రంగాల కార్మికులు ర్యాలీ, ధర్నాలతో పాటు సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పండా కృష్ణయ్య, గిరిజన సంఘం జిల్లా నాయకుడు సీసం సురేష్, సీఐటీయు మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్ మాట్లాడారు. కార్యక్రమంలో వివిద రంగాల కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి

రంపచోడవరం: ఆల్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పిలుపులో భాగంగా బుధవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడె మోక్రసీ డివిజన్ కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి మాట్లాడుతూ భవననిర్మాణం, ఆటో, హమాలీ తదితర కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, స్కీమ్ కార్మికులకు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యు జిల్లా కార్య దర్శి పి.అనసూయ, ఏఐకేఎంఎస్ నాయకులు మడకం గోవింద్, కె.బుచ్చన్నదొర పాల్గొన్నారు.

సమ్మెకు లోయర్ సీలేరు విద్యుత్ ఉద్యోగుల సంఘీభావం

మోతుగూడెం: అఖిలభారత ట్రేడ్ యూనియన్లు అన్నీ కలిసి దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఎన్‌సీసీవో ఈఈఈ, ఏఐఎఫ్‌ఈఈ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు సమ్మె కు సంఘీభావంతో లోయర్ సీలేరు విద్యుత్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో ధర్నా చేశారు. కేంద్రప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్మిక చట్టాల సవరణ కుగాను 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావాలని పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో లోయర్ విద్యుత్ ఉద్యోగులు, సీలేరు ఐక్య కార్యాచరణ వేదిక చైర్మన్ వి.కిరణ్, కన్వీనర్ పి.ఆనంద్‌బాబు, రామారావు, పవన్, దారబాబు, కార్మిక సంఘాల నాయకులు, ఇంజనీర్లు, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

వై.రామవరం: కార్మికుల సమస్యలపై బుధవారం దేశ వ్యాప్తంగా నిర్వహించిన సార్వత్రిక సమ్మెలో భాగంగా వై.రామవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పలువురు స్కీమ్ వర్కర్లు ర్యాలీ, మానవహారాలు నిర్వహించారు. సీఐటీయూ మండల అధ్యక్షురాలు బేబీరాణి అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ26వేలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో నినాదాలు చేశారు. మండల కార్యదర్శి శాంతి రాజు, నాయకులు కె.బుల్లమ్మ, మల్లికార్జున రావు, కార్మిక సంఘాలు పాల్గొన్నాయి.

బీఎల్వోలకు ఎలక్టోరల్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

రంపచోడవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ బూత్ లెవెల్ ఆఫీసర్ల(బీఎల్వోలు)కు ఎన్నికల జాబితా నిర్వహణ(ఎలక్టోరల్ మేనేజ్‌మెంట్)పై శిక్షణ కార్యక్రమం చేపట్టినట్టు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ తెలిపారు. భారత ఎన్నికల సం ఘానికి అనుబంధ సంస్థ అయిన ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు బీఎల్వోలకు శిక్షణను బుధవారం నాటికి 5వ బ్యాచ్‌కి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల డీటీ సునీత, మాస్టర్ ట్రైనర్ సుధా ప్రకాష్ మార్గ నిర్దేశం చేశారు.

పంచాయతీ పురోగతిపై శిక్షణ

వై.రామవరం, జూలై 9(ఆంధ్రజ్యోతి):స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో బాపన్నదొర పంచాయతీల పురోగతి అంశంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పేదరిక నిర్మూలన, ఆరోగ్యకరమైన గ్రామ పంచాయతీ, బాలస్నేహ పూర్వగ్రామపంచాయతీ, నీటి సమృద్ధి కలిగిన గ్రామ పంచాయతీ, సుపరిపాలన కలిగిన గ్రామపంచాయతీవంటి తొమ్మిది అంశాలపై అవగాహన కల్పించినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఇందుకూరుపేటలో మెగా వైద్య శిబిరం

దేవీపట్నం, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరుపేట గ్రామంలో గోకవరం ఆదిత్య మల్టీ స్పెషాల్టీ హాస్పటల్ వారి ఉచిత మెగా వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఆసుపత్రి చైర్మన్ నామ శ్రీనివాస్, ఎండీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీపీ కుంజం మురళి, జడ్పీటీసీ శీరసం సత్యవేణి పెద్ద అబ్బులు, సర్పంచ్ కారం కృష్ణబాబు సహకారంతో గర్భిణీలకు ఉచిత ఓపీ, స్కానింగ్ డా క్టర్ భారతి నిర్వహించారు. .

మొక్కలు పంపిణీ

మారేడుమిల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి బాలుర ఆశ్రమ పాఠశాల ఆవ రణలో, ఏకలవ్య స్కూల్ ఆవరణలో, పలు పాఠశాలల్లో వనవాసి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ గొర్లె అనుదీప్‌కుమార్ ఆధ్వ ర్యంలో సుమారు 1000 మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి సర్పంచ్ కొండా జాకోబు, మాజీ జడ్పీటీసీ సత్తి సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గొర్లె అనిల్ ప్రసాద్, మారేడుమిల్లి యువత ఏకలవ్య ప్రిన్సిపాల్ ప్రసాద్, బాలుర పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెం సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

మోతుగూడెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో ఉన్న సమస్యలపై ఎమ్మెల్యేగా శిరీషదేవికి ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. చింతూరు మండలం మోతుగూడెంలో ఆసుపత్రి కావాలని, వీధుల్లో డ్రైనేజీ నిర్మించాలని, మంచినీటి సమస్య పరిష్కరించాలని, మల్లవరంలో మంచినీటి, విద్యుత్ సమస్య పరిష్కరించాలని, నేలకోట రహదారి వంతెన నిర్మించాలని, గిరిజనులకు ఎస్టీ ఆర్ కాలనీ మంజూరు చేయాలన్నారు.

'మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి'

చింతూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చింతూరు సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ రమేష్ పేర్కొన్నారు. బుధవారం కళాశాల, పాఠశాలల విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంపై చోటుచేసుకునే నష్టాలపై సీఐ, ఎస్ఐలు వివరించారు. పాఠశాల ప్రాంగణాలకు 100 మీటర్ల దూరంలో ఎటువంటిపొగాకు వస్తువుల విక్రయాలను జరపకూడదన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం







జగ్గంపేటలో బ్యాంకు వద్ద కార్మిక సంఘాల నిరసన, గండేపల్లిలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఏలేశ్వరంలో దేశవ్యాప్త సమ్మెలో పాల్గొన్న నాయకులు

జగ్గంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్మిక, ఉద్యోగ, రైతు, వ్యతిరేక విధా నాలను వ్యతిరేకిస్తూ ప్రాంతీయ కార్మిక సంఘాలు పిలుపునివ్వడంతో బుధ వారం జగ్గంపేటలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మరుకుర్తి ఏసు ఆధ్వర్యంలో బంద్ చేశారు. ప్రజా సంఘాలు, కార్మిక నాయకులు జగ్గంపేట పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మె విజయవంతమవ్వడంతో రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకుడు వి.చిట్టిబాబు విప్లవ ధన్యవాదాలు తెలిపారు. సంఘ నేతలు బి.రమేష్, జె.రాజు, అచ్చారావు, కడితి సతీష్, కే.బాబురావు పాల్గొన్నారు.

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఏలేశ్వరంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ, ఏఐసీసీటీయూ, వివిధ కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో బాలాజీ చౌకొసెంటర్లో మానవహారం ఏర్పాటు చేసి కేంద్రప్రభుత్వం తీసుకువస్తున్న నాలుగే లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు పాకలపాటి సోమరాజు, పిల్లా రాంబాబు, ఏఐసీసీటీయూ నాయకుడు ఏగుపాటి అర్జున్‌రావు, మండల అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, ఏలేశ్వరం నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

శంఖవరం, (ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. స్థానిక ఐసీడీయస్ కార్యాలయం నుంచి నిరసన ర్యాలీ చేసి తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. బుల్లెమ్మ, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గండేపల్లి, (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన దేశవ్యాప్త సమ్మె గండేపల్లి మండలంలో విజయవంతమైంది. తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ, ఆశా, భవననిర్మాణ కార్మికులు హాజరై నిరసన తెలిపారు. కేంద్రం 4 లేబర్ కోడ్‌లు తీసుకురావడాన్ని వ్యతిరేకించారు. ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. తహశల్దార్ శ్రీనివాస్‌కు డిమాండ్లతో కూడిన వినతి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి ఎరుబండి చంద్రావతి, మార్ని లక్ష్మీ, శ్రీను, పి.తాతారావు, బళ్ల అప్పారావు, టి.ప్రసాద్, సీహెచ్ వీరబాబు, చెల్లూరి శ్రీను, వెంకటేశులు, ఎ.సత్తిబాబు, వైవి రాజేశ్వరి, మంగతాయారు పాల్గొన్నారు.

రౌతులపూడి, (ఆంధ్రజ్యోతి): సమ్మెలో భాగంగా రౌతులపూడిలో సీఐటీయూ సభ్యులు తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేశారు. కేంద్రప్రభుత్వం తెచ్చిన నాలుగు లెబర్ కోడ్‌లను రద్దు చేయాలని తహశీల్దార్ ఎస్వీ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో బుధవారం సార్వత్రిక సమ్మెలో భాగంగా విప్లవ సంఘాలు, ప్రదర్శనలు, ర్యాలీలు, సభలు నిర్వహించాయి. సీపీఐ ఎంఎల్ లిబరేషన్, సీపీఎం, సీఐటీయూల ఆధ్వర్యంలో వేర్వేరుగా ప్రదర్శనలు నిర్వహించారు. పాత తహశీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ నిర్వహించిన సభలో పార్టీ మండల కార్యదర్శులు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, పనిచేసే కార్మికులకు రూ.26వేలు చెల్లించాలని, కనీస వేతనచట్టం ప్రకారం కార్మికులు ఉద్యోగ భద్రత కల్పించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు నిధులు కేటాయింపు చేయాలని రాష్ట్ర కేబినేట్ పని గంటల పని విధాన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగ్గంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు కోనేరు మురళీ తనయుడు సుష్మంత్ వెంకట్ ఇటీవల మృతి చెందాడు. బుధవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ రాజమహేంద్రవరంలోని కోనేరు మురళీ ఇంటికి వెళ్లి సుష్మంత్ వెంకట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ కిర్లంపూడి మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మురారి, ఉపసర్పంచ్ జాస్తి వసంత్, తొర్రేడు కిషోర్ ఉన్నారు.

సొసైటీ అధ్యక్షుల ఎంపిక

గండేపల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): గండేపల్లిలో ఆరు సొసైటీల్లో అధ్యక్షులను ప్రభుత్వం ఎంపిక చేసింది. గండేపల్లి సొసైటీ చైర్మన్‌గా ఎన్టీరాజాపురం గ్రామానికి చెందిన కంటిపూడి సత్యనారాయణ, మల్లేపల్లి సొసైటీ చైర్మన్‌గా దిడ్డి వెంకటరాజు (చిన శ్రీను), మురారి సొసైటీ చైర్మన్‌గా చావా తమ్మన్నచౌదరి, ఉప్పలపాడు సొసైటీ చైర్మన్‌గా తమటం నాగేంద్ర, నాయకంపల్లి సొసైటీ చైర్మన్‌గా పాలకుర్తి ఆదినారాయణ, జడ్.రాగంపేట సొసైటీ చైర్మన్‌గా కందుల కొండయ్యచౌదరి (బాబ్జీ)లు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీజిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్ నేతృత్వంలో ఎంపికయ్యారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

శంఖవరం, జూలై9(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఏవో పి.గాంధీ అన్నారు. బుధవారం కొంతంగి, నెల్లిపూడి గ్రామాల్లో విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. టీడీపీ నేతలు బద్ది రమణ, సర్దం గోవింద్, కర్రి శివాజీ, బద్ది రామకృష్ణ, మందపల్లి శివరామకృష్ణ, గొర్లి నాగేశ్వరావు, బద్ది లోవరాజు, వ్యవసాయ సిబ్బంది మౌళి ప్రసాద్, శ్రావణి, తరుణ్ పాల్గొన్నారు.

కూటమి పాలనలో గ్రామాల అభివృద్ధి



గుర్రపాలెంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామాల అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని గుర్రప్పాలెం గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ పాలన అంతా రాక్షస పాలన నడిచిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేస్తూ, ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తూ దేశంలో ఏ రాష్ట్రం అందించని సంక్షేమాన్ని ఈప్రభుత్వం అందిస్తుందన్నారు. గడపగడపకు వెళ్తేంటే ప్రభుత్వం పట్ల ప్రలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, ఇదే మంచి ప్రభుత్వానికి ఇదే నిదర్శనమన్నారు. ప్రజా పాలనకు రాక్షసి పాలనకు తేడాను ప్రజలు గ్రహించారన్నారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, దాట్ల సూరిబాబు, పడాల బాలలాజీ,అడపా తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో జపాన్ దినోత్సవం ప్రారంభం

గండేపల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో జపాన్ దినోత్సవం బుధ, గురు, శుక్రవారం నిర్వహించనున్నట్టు యూనివర్శిటీ డిప్యూటీ ప్రోఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ప్రారంభమైన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జెంకిన్స్ జపాన్ సీనియర్ ప్రతినిధి టాకాకో ఇమామురా, జెంకిన్స్ ఇండియా ప్రతినిధి ప్రియాంక సర్కార్‌హాజయ్యారు. వైస్‌చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడిగా పైడిరాజు



రౌతులపూడి, జూలై 9(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి సొసైటీ అధ్యక్షుడిగా బలరామపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ నేత పైల పైడిరాజును ఎంపిక చేశారు.

'నిరసనకు అనుమతినివ్వండి'

శంఖవరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి నుంచి శంఖవరం మీదుగా విచ్చలవిడిగా తిరుగుతున్న భారీ వాహనాలపై పలుమార్లు ఫిర్యాదులు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని దీనిపై నిరసన తెలి పేందుకు అనుమతిని ఇవ్వాలని జనసేన నేత మేకల కృష్ణ కోరారు. ఈ మేరకు అనుమతి కోరుతూ పెద్దాపురం డీఎస్పీకి దరఖాస్తు చేశారు. భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్లు ధ్వంసం అవ్వడంతో పాటు ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని.. రిలే నిరాహార దీక్ష లేదా ఆమరణ నిరాహార దీక్షకు అనుమతిని ఇవ్వాలని ఆయన కోరారు.

పాఠశాలలు సందర్శించిన సీఐ

కిర్లంపూడి, జూలై9(ఆంధ్రజ్యోతి): సోమవరం, బూరుగుపూడి, సింహాద్రిపురం, వీరవరం గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను బుధవారం జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సందర్శించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి బాలికల రక్షణ, ఇతర అంశాలపై చర్చించారు. డ్రగ్స్ వద్దు బ్రోఅన్నది ప్రభుత్వ నినాదమని, దానిని చిత్తశుద్ధితో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలలకు వంద మీటర్లలోపు పొగాకు ఉత్పత్తుల అమ్మకం, వాడకం నిషేదమన్నారు.

లారీలు ఆపి నిరసన

రౌతులపూడి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జల్దాం గ్రామశివారు చల్లూరు డంపింగ్ యార్డు నుంచి వస్తున్న లాటరైట్ లారీలను గిరిజనులు నిలిపివేసి ఆందోళన చేశారు. రాఘవపట్నం, జల్దాం, మాతయ్యపేటకు చెందిన టీడీపీనేత గంటిమళ్ల గంగరాజు, తారక్, ఆమూరి సుదారాణిలు లారీలను అడ్డుకుని ఆందోళన చేశారు. లారీలు తిరడగంతో రహదారులు ఛిద్రం అవుతున్నాయన్నారు. దుమ్మధూళితో పంటలు నాశనవుతున్నాయని, నీరు కలుషితమై అనారోగ్యాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

పారిశుధ్య పనుల పరిశీలన

గండేపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నీలాద్రిరావుపేటలో జరుగుతున్న పారిశుధ్య పనులను బుధవారం పెద్దాపురం డివిజన్ డెవలప్‌మెంట్ అధికారిణి ఎం.శ్యామల పరిశీలించారు. తడిపొడి చెత్త సేకరణ గురించి అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

కిర్లంపూడి సొసైటీ చైర్మన్‌గా చినబాబు

కిర్లంపూడి/జగ్గంపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి సొసైటీ చైర్మన్‌గా కుర్ల చినబాబు నియమితులయ్యారు. బుధవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను చిన బాబు, సొసైటీ సభ్యులు పాటంశెట్టి వెంకటలక్ష్మి, నాగేశ్వరరావు, గండే రాయుడు కలిశారు. వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో చదరం చంటిబాబు, తూము కుమార్, కాళ్ల వెంకటేష్, బొదిరెడ్ల సుబ్బారావు, మంచికంటి శ్రీను, నంది బాలకృష్ణ, ఆడారి నానాజీ తదితరులు పాల్గొన్నారు.




ప్రత్తిపాడు మినర్వా వద్ద రోడ్డు ప్రమాద దృశ్యం

ప్రత్తిపాడులో కారును ఢీకొన్న లారీ

ప్రమాదం నుంచి బయటపడిన ఏలేశ్వరం కమిషనర్

ప్రత్తిపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావు కారు ధ్వంసమైంది. ఆయన సురక్షితంగా బయటపడగా తృటిలో విద్యార్థులు కూడా తప్పించుకున్నారు. ఏలేశ్వరం కమిషనర్ వెంకటేశ్వరరావు, డ్రైవర్ నాగేశ్వరరావుతో కారులో ఏలేశ్వరం నుంచి కత్తిపూడి వైపు బయలుదేరారు. సాయంత్రం సమయంలో కారు మినర్వా కళాశాల వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొని కొంత దూరం ఈడ్చుకుపోయింది. దీంతో కారు ముందుభాగం పాక్షికంగా ధ్వంసం కాగా అందులో ప్రయాణిస్తున్న కమిషనర్, డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జరిగిన ప్రమాదంపై ఆరా తీశారు.



హోటల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ, శ్రీనివాసనంద స్వామీజీ

ముగిసిన హోటల్ వివాదం

గండేపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లి గ్రామ శివారులో రాయుడు గారి మిలటరీ హోటల్‌లో వేంకటేశ్వర స్వామి ఆలయ నమూనా సెట్ వేయడంతో వివాదం తలెత్తిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి స్వామీజీ, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కలిసి హోటల్‌ను సందర్శించి యాజమాన్యంతో మాట్లాడారు. ఆలయ నమూనా తీసి వేసి విగ్రహం ఒకటే ఉంచుకోవాలన్నారు. యాజమాన్యం ఒప్పుకోవడంతో వివాదం సర్దుమణిగింది.

సొసైటీ చైర్మన్లుగా జనసేననేతల నియామకం

ప్రత్తిపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన ఇద్దరు జనసేన నాయకులు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల చైర్మన్‌లుగా నియమితులయ్యారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరం పీఏసీఎస్‌కు జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి దాసం శేషారావు, ఏలేశ్వరం మండలం పీఏసీఎస్‌కు జనసేన మండలాధ్యక్షుడు పెంటకోట మోహన్ నియమితులయ్యారు. దీంతో ఆ పార్టీకి చెందిన జనసైనికులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పంచాయతీల అభివృద్ధి సూచికలపై శిక్షణ

తొండంగి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధి సూచికలపై బుధవారం పంచాయతీ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో రాజేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో షేక్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పాటుపడాలి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల

తునిరూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి నూతనంగా ఎంపిక కాబడిన పీఏసీఎస్ కమిటీ చైర్మన్‌లు, మెంబర్లు పాటుపడాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఎస్ఎస్‌పట్నం పీఏసీఎస్ అధ్యక్షుడిగా తేటగుంట గ్రామానికి చెందిన పేరూరి వెంకటకృష్ణ ఎంపిక కాగా ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి యనమలను కలిశారు. కార్యక్రమంలో యనమల రాజేష్, టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, గజ్జి అప్పలరాజు, గజ్జి రాంబాబు, కొల్లు సత్తిబాబు, చామంతి సత్తిబాబు ఉన్నారు.

నాటుసారా అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు

జిల్లా ఎక్సైజ్ అధికారిణి కృష్ణకుమారి

తుని రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సారా అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు ఎక్సైజ్ జిల్లా అధికారిణి ఎం.కృష్ణకుమారి తెలిపారు. తుని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన నల్లబెల్లం మూటలు, సీజ్ చేసిన వాహనాల వివరాలను బుధవారం తునిలో మీడియాకు వెల్లడించారు. కాకినాడ జిల్లా దుర్గాడ గ్రామానికి చెందిన యండపల్లి శ్రీనివాస్‌ను రౌతులపూడి మండలం లచ్చిరెడ్డిపాలెంలో పట్టుకున్నట్టు తెలిపారు. అతడి వాహనంలో 85 బెల్లం మూటలతో 3400 కిలోల నల్ల బెల్లం ఉన్నట్లు తెలిపారు. నల్లగొండ లోవకుంట సమీపంలో బొడ్డు సునీల్, దుర్గాడ గ్రామానికి చెందిన పెదపాటి లోవరాజు 2 ద్విచక్ర వాహనాల్లో సారాను తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వారిని అరెస్ట్ చేసి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు ఆమె తెలిపారు. బెల్లంతో పాటు వాహనాలు సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. దాడుల్లో తుని ఎస్‌హెచ్‌వో వై.పట్టాభి చౌదరి, హెడ్‌కానిస్టేబుల్ సూర్యప్రకాష్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంగా శ్రీనివాస్

ప్రత్తిపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండల వెలుగు ఏపీఎంగా జి.శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. విజయనగరం నుంచి బదిలీ ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించిన వై.వెంకట్రావు వెలుగు సీసీగా కొనసాగుతారు.


జె.అన్నవరంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

ఏలేశ్వరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జె.అన్నవరం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ప్రజా ప్రతినిధులను ప్రజలను కలిసి మాట్లాడారు. రమణయ్యపేట నుంచి జె.అన్నవరం రహదారిపై ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. ఏళ్ళ గడుస్తున్నా రోడ్డు పనులు చేపట్టలేదని స్థానికులు తెలుపగా, త్వరలో పనులు చేపడతామని ఎంపీపీ బుజ్జి వారికి నచ్చజెప్పారు. కార్యక్రమంలో జ్యోతుల పెదబాబు, ధనేకుల భద్రరావు, అలర్క రాజు, బాజింకల కన్నారావు పాల్గొన్నారు.

లంపకలోవలో..

ప్రత్తిపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంపకలోవ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం టీడీపీ నాయకులు ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, గొంతిన సురేష్, అమరాది వెంకట్రావు, మిరియాల శ్రీను, గంటా రాంబాబు, మండల పరిషత్ కో ఆప్షన్‌మెంబర్ గంటా చంటిబాబు పాల్గొన్నారు.

జ్యోతుల నవీన్‌కు సన్మానం



ప్రత్తిపాడు, జూలై 9 (ఆంధ్ర జ్యోతి): టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్‌కు ధర్మవరంలో బుధవారం సన్మానం నిర్వహించారు. టీడీపీ నాయకులు బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, పుణ్యమంతుల రాజా, ముప్పనబోయిన ఏసుబాబులు నవీన్‌కుమార్‌ను గజమాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమాల్లో ఉత్తరకంచి సర్పంచ్ మం తెన వెంకటరమణ, వై.గోవిందనాయుడు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు సబ్‌స్టేషన్ పరిధిలో ఉప్పలపాడు, సుబ్బయ్యపేట గ్రామాలకు గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, గండేపల్లి ఏఈ కిరణ్‌కిషోర్ తెలిపారు. శుక్రవారం గండేపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న ఎన్టీరాజాపురం, సింగరంపాలెం, రామయమ్మపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. బొర్రంపాలెం పరిధిలో ఉన్న మల్లేపల్లి, కె.నాయకంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో కె.నాయకంపల్లి, పి.నాయంకపల్లి, యల్లమిల్లి, రామేశ్వరంపేట గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ

టెండర్ కం బహిరంగ కౌలు వేలం పత్రికా ప్రకటన

[illegible]

వ.నెం	సర్వే నెం.	విస్తీర్ణం ఎ.లు	వ.నెం	సర్వే నెం.	విస్తీర్ణం ఎ.లు	వ.నెం	సర్వే నెం.	విస్తీర్ణం ఎ.లు
1.	535	8-00	5.	553	196-90	9.	565	41-00
2.	545	20-20	6.	690	54-98	10.	538,565	7-00
3.	549	50-55	7.	623	6-80	11.	553,538	10-00
4.	538	78-94	8.	621	4-09			

మరిన్ని వివరములకు సెల్ నెంబరు 9121864089 నందు కాని, పిఠాపురం సత్రం ఆఫీసు పనివేళలలో కాని తెలుసుకొనవచ్చును.

పిఠాపురం
ది.9-7-2025

సున్న శ్రీరాములు
కార్యనిర్వహణాధికారి శ్రీ సంస్థానం సత్రం

APSRTC
SHORT TENDER NOTICE
పల్లె వెలుగు

Tenders are invited through ONLINE ("www.tender.apeprocurement.gov.in") for 1. Improvements to In and Out Gates at Bus Station, Kakinada, Kakinada District. 2. Renovation of Inspection Pit at Bus Depot, Amalapuram, Dr.B.R.A.Konaseema District. 3. Providing Extension to the existing Parcel Office (Dispatch Unit) of size 30'x21' in new Bus Station at Eluru, Eluru District, 4. Providing Cement Concrete Pavement to the yard in between I & II Depot Gates in Bus Station at Nellore, SPSR Nellore District, 5. Construction of Basement walls and raising of flooring in Bus Body repair shed -2 of 60'x40' size in ZWS, Nellore, SPSR Nellore District, 6. Repairs and Improvements to the Bus Station Building at Pamidi in Ananthapuramu District. For full Tender Notice please visit **"www.apsrtc.ap.gov.in"**. For Online participation please visit **"https://tender.apeprocurement.gov.in"**. **NOTE:** Bid Document download Start Date & Time: **21.07.2025, 4.00 PM**, Bid Submission Closing Date & Time : **28.07.2025, 4.00 PM.** Further details: Ph. No: 9959224686 (10.00 AM to 5.30 PM). APSRTC reserves the right to cancel or reject any tender or all the tenders of this notification without assigning any reason at any stage.

NIT NO. 08/CCE/APSRTC/2025-26, Dt. 08-07-2025 — Chief Civil Engineer, APSRTC, Vijayawada

శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం, పిఠాపురం

దేవదాయ-ధర్మదాయశాఖ, పిఠాపురం టౌన్, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా

కాకినాడ జిల్లా, పిఠాపురం మండలం, పిఠాపురం పట్టణంలో వేంచేసిన శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం, పిఠాపురం, దేవస్థానమునకు 2025-2026 సంవత్సరమునకు అనగా ది.26-07-2025 నుండి ది.31-03-2026 వరకు (8 నెలల 6 రోజులకు) దేవస్థానం మరియు అన్నప్రసాదం, గోశాల నిమిత్తం, ఈ క్రింది వివరించిన అంశములు సప్లై చేయుటకు ది.25-07-2025 శుక్రవారం మధ్యాహ్నం 2.00గంటల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడుచున్నవి. సీలు వేసిన టెండర్ అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల సమక్షములో తెరువబడును.

వ.నెం	వివరములు	కాలపరిమితి	ధరావత్తు రూ.	టె.షె. ఖరీదు రూ.
1	కూరగాయలు సరఫరా (రైతు బజారు రేట్లు కన్నా తక్కువగాను మరియు ఎంత పర్సెంట్లు తగ్గించి ఇస్తారో కోట్ చెయ్యాలి)	26-07-2025 టు 31-03-2026	25,000	500
2	శానిటరీ ఐటమ్స్	డిటో	10,000	500
3	స్టేషనరీ ఐటమ్స్	డిటో	10,000	500
4	పాలు మరియు పెరుగు1/2 లీటర్లు పాకెట్స్	డిటో	10,000	500
5	గోవులకు ఎండు గడ్డి సరఫరా,చిట్టు తవుడు, నూక కొంటు	డిటో	10,000	500

ముఖ్యషరతులు: 1.ఆసక్తి గల టెండరుదారులు టెండర్ షెడ్యూలు రూ.500/- నగదు చెల్లించి రశీదు పొందవలెను. 2.టెండర్ షెడ్యూల్ ది.22-7-2025 ఉదయం 10.00 గంటల నుండి ది.24-7-2025 సాయంత్రం 5:00 గంటల వరకు దేవస్థానం వద్ద విక్రయించబడును. టెండర్ దాఖలు చేయునపుడు టెండర్ షెడ్యూల్లో తెలిపిన విధముగా ప్రధమ ధరావత్తు వేరువేరుగా ఏదేని జాతీయ బ్యాంకు నందు కార్యానిర్వహణాధికారి శ్రీపాద శ్రీవల్లభ సేవ సంఘ్, పిఠాపురం వారి పేరున డి.డి తీసి లేదా నగదు రూపేణ గాని టెండర్ షెడ్యూల్‌తో జతపరచి పొల్గొనవలెను. 3.టెండర్ షెడ్యూల్‌తో పాటు ప్రొప్రైటర్ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, రిజిస్ట్రేషన్ డీలర్ సర్టిఫికేట్ మరియు ఫరమ్ జి.ఎస్.టి. సర్టిఫికేట్ కాపీ మరియు 3సం. ఇన్కమ్ టాక్స్ రిటర్న్ కాపీలు తప్పని సరిగా జతపరచవలెను. ఇవి మూడవసారి పిలుచుచున్న టెండర్లు, ఇతర టెండర్ షరతులు మరియు వివరములు కొరకు దేవస్థానం పనివేళలలో యందు తెలుసుకోనవచ్చును.

కార్యనిర్వహణాధికారి గ్రేడ్-1
శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం, పిఠాపురం